

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 34 | విజయవాడ, ఆదివారం 3 సెప్టెంబర్ 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 3 September 2023 | Rs



మెరుపులు వర్షార్పణం

- ఇషాన్, హార్దిక్ అర్ధ శతకాలు వృధా
- టీమిండియా 266ఆలౌట్
- మ్యాచ్ రద్దు

లోపలి పేజీలో..

నింగిలోకి ఆదిత్య

పిఎస్ఎల్వి సి-57 ప్రయోగం విజయవంతం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూర్యుని చుట్టూ వాతావరణ పరిస్థితులపై పరిశోధనలు చేసేందుకు రూపొందించిన 'ఆదిత్య ఎల్-1' శ్రీహరికోట షార్ నుంచి శనివారం ఉదయం 11.50 నిమిషాలకు నిప్పులు చిమ్ముతూ దూసుకెళ్లింది. ప్రయోగం అనంతరం 63 నిమిషాల 30 సెకండ్ల తరువాత ఆదిత్య ఎల్-1 మిషన్‌ను నిర్దిష్ట కక్షలో పిఎస్ఎల్వి సి-57 రాకెట్ వదిలిపెట్టింది.

1475 కిలోల బరువు కలిగిన ఈ మిషన్ సూర్యుని సమీపానికి చేరుకోవడానికి సుమారు 125 రోజుల సమయం పడుతుంది. ఆదిత్య ఎల్-1లోని ఏడు పే లోడ్స్‌లో నాలుగు నేరుగా సూర్యునిపై పరిశోధనలు చేస్తాయి. మిగిలిన మూడు సౌర రేణువులు, అయస్కాంత క్షేత్రాలపై పరిశోధనలు జరపనున్నాయి. ఐదు పే లోడ్స్‌ను ఇస్రో సారథ్యంలో, రెండు భారతీయ విద్యాసంస్థల ద్వారా రూపొందించారు.

ఆదిత్య ఎల్-1 మిషన్ 16 రోజుల పాటు భూ కక్షలో తిరుగుతూ ఉంటుంది. భూమి చుట్టూ నాలుగుసార్లు తిరిగిన తరువాత సూర్యుని వైపుకు ప్రయాణిస్తుంది. ఆదిత్య ఎల్-1 లాంచింగ్ విజయవంతమైనట్లు ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ వెల్లడించారు. రాకెట్ నుంచి ఆదిత్య ఎల్-1 విజయవంతంగా విడిపోయిందని.. దానిని కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఈ ప్రయోగం విజయవంతమవడానికి సహకరించిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.



వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ఆర్‌కు సిఎం జగన్ నివాళి

2

అదాని 'డొల్ల' నిజమే!

- పండోరా పేపర్లలోనూ ఆ కంపెనీలు
- వెలుగులోకి మరికొన్ని పేర్లు

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్రమోడీకి అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదాని డొల్లకంపెనీలతో వేల కోట్ల రూపాయల ఆర్థిక ఆక్రమాలకు పాల్పడ్డారంటూ ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ (ఒసిసిఆర్‌పి) వెలువరించిన నివేదికను మరింతగా బలపరిచే ఆధారాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. 2021వ సంవత్సరంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పండోరా పేపర్లలోనూ ఆదానికి చెందిన డొల్లకంపెనీల వివరాలు ఉన్నట్లు, ఆ వివరాలు ఒసిసిఆర్‌పి పరిశోధనతో సరిపోయినట్లు ప్రముఖ ఆంగ్లదినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ధృవీకరించింది. అప్పట్లో పండోరా పేపర్లలో చోటుచేసుకున్న భారతీయ కంపెనీలు, వ్యక్తుల గురించి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ధారావాహకంగా పలు కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. అదాని డొల్ల కంపెనీలపై ఒసిసిఆర్‌పి నివేదిక బహిర్గతమైన తరువాత పండోరా పేపర్లను మరోసారి పరిశీలించిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్‌లో (టాక్స్ హెవెన్స్)లో రిజిస్టర్ అయిన రెండు ఆఫ్‌షోర్ షెల్ కంపెనీలు అదాని గ్రూపు సంస్థల్లోకి నిధుల తరలింపుకోసం వాహకాలుగా ఉపయోగపడిన విషయం నిజమేనని పేర్కొంది. ఒసిసిఆర్‌పి ఇప్పటికే ప్రస్తావించిన వ్యక్తులు కాకుండా మరికొందరు కొత్త వ్యక్తుల పేర్లు కూడా తాజా పరిశీలనలో వెలుగులోకి వచ్చాయి.ఈ వివరాలతోనే 'ది వైర్' కూడా ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణ జరపాలన్న డిమాండ్ పెద్ద ఎత్తున వ్యక్తమవుతోంది. అయితే, మోడీ సర్కారు నుండి మాత్రం ఎటువంటి స్పందన కనిపించడం లేదు. గౌతమ్ అదానికి సోదరుడైన వినోద్ అదానికి సన్నిహితులైన నాసర్ ఆలీ షాబాన్ అహ్లీ, చాంగ్‌చుంగ్ లింగ్ అనే ఇద్దరు వ్యక్తులు ఈ డొల్ల కంపెనీలు స్థాపించారని ఒసిసిఆర్‌పి నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే. భారతీయ చట్టాలను తుంగలో తొక్కడానికి, షేర్ల ధరలను కృత్రిమంగా పెంచడానికి, నల్లడబ్బును తెలుపుగా మార్చుకోవడానిక ఈ కంపెనీలను ఉపయోగిచారని, ఈ ఆర్థిక లావాదేవీలను వినోద్ అదాని కార్యాలయమే పర్యవేక్షించిందని ఆ నివేదికలో పేర్కొన్నారు.



పండోరా పేపర్లలో ఇలా...

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తాజాగా చేసిన పడోరా పేపర్ల పరిశోధన ప్రకారం గల్ఫ్ ఆసియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ అనే సంస్థను అహ్లీ, చాంగ్ లింగో ఇన్వెస్టిమెంట్స్ సంస్థను ఉపయోగించారు. వీటితో పాటు గ్లోబల్ ఆపర్చ్యునిటీస్ ఫండ్ (బెర్ముడా), ఇఎం రిసర్జెంట్ ఫండ్ (మారిషస్), ఇండియా ఫోకస్ ఫండ్ (మారిషస్) సంస్థల ద్వారా అదాని సంస్థల్లోకి నిధులు పంపారు. అదాని కంపెనీకి చెందిన ఆఫీస్ బేరర్లు, ఉద్యోగులే అహ్లీ, చాంగ్‌లు స్థాపించిన సంస్థల కార్యక్రమాలను, రికార్డులను నిర్వహించేవారు. ఈ సంస్థల రికార్డులకు సంబంధించి దుబాయ్‌కు చెందిన ఒక ఛార్టెర్డ్ అక్కౌంటెంట్ సంస్థ ట్రైడెంట్ ట్రస్టును 'చేతితో రాసిన పత్రాలను అంగీకరిస్తారా?' అని అదాని కార్యాలయ ఉద్యోగులు అడిగారు. నగదు, వాటాల బదిలీలకు సంబంధించి కూడా కొన్ని ప్రశ్నలు అడిగారు. 1994లో వినోద్ అదాని తన భార్య రంజన్‌బెన్‌తో కలిసి జిఎ ఇంటర్నేషనల్ ఇంక్ అనే డొల్ల సంస్థను బహమాన్‌లో స్థాపించారు. రంజెన్‌బెన్ స్థానంలో రాకేష్ శాంతిలాల్ షా అనే వ్యక్తి 1996లో డైరక్టర్‌గా పనిచేశారు. పరిశీలనలో దొరికిన ఒక ఒప్పంద పత్రం ప్రకారం అహ్లీ తన నూరుశాతం వాటాలను శాంతిలాల్‌షాకు బదిలీ చేసినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది. లింగో ఇన్వెస్టిమెంట్స్ లిమిటెడ్ 2010 ఆగస్టులో దాని వ్యవస్థాపక దినం రోజున బ్యాంకు ఖాతాలు నిర్వహించడానికి, ఆస్తులు, స్టాక్‌లలో పెట్టుబడులు పెట్టడానికి డైరక్టర్ ఛాంగ్‌తో పాటు తేజల్ రామ్‌లాల్ దేశాయ్‌కు పవర్ ఆఫ్ అటార్నీ మంజూరు చేసింది. అహ్మదాబాద్‌కు చెందిన ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ కార్యాలయ రికార్డుల ప్రకారం ఈ రామ్‌లాల్ అదాని గ్లోబల్ సంస్థ ఉద్యోగిగా తేలింది.

దేశవ్యాప్తంగా గాంధీజయంతి

- ఇండియా నిర్ణయం

5

రేపు సమరభేరీ ధర్నాలు

- జయప్రదం చేయాలని సిపిఎం పిలుపు

2



వైఫల్యాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు

- 40 ఏళ్లలో ఇలాంటి పాలన ఎప్పుడూ చూడలేదు
- 'బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ'లో చంద్రబాబు

2

లైంగిక వేధింపులకు పాల్పడితే తొలగించడం సరైనదే : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఎపిఎస్‌పి రెండో బెటాలియన్ ఉద్యోగి సి గోవిందరాజులును సర్వీస్ నుంచి ప్రభుత్వం తొలగించడాన్ని హైకోర్టు సమర్థించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ కె మన్మథరావుతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. ఎపి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ.. కర్నూలు ఎపిఎస్‌పి రెండో బెటాలియన్‌లో జూనియర్ అసిస్టెంటుగా 1994లో చేరిన గోవిందరాజులు హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. సహోద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఆయనను ప్రభుత్వం 2013లో సర్వీస్ నుంచి తొలగించింది. దీనిపై అప్పీల్ దాఖలు చేయగా ఎపిఎస్‌పి డిఐజి కొట్టేశారు. దీనిపై ట్రిబ్యునల్ అప్పీల్ దాఖలు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో హైకోర్టులో అప్పీల్ పిటిషన్ వేశారు. పిటిషనరుపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయని, 18 ఏళ్ల సర్వీస్‌లో ఆరుసార్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, ఇలాంటి విషయంలో కరుణ చూపనక్కర్లేదని హైకోర్టు తీర్పు చెప్పింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

స్టీల్‌ప్లాంట్‌పై మోడీ వైఖరి మారాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, బి.కామేశ్వరరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 933వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ సిఐసిసిపి విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ.. బిజెపి పాలనలో దేశ ప్రజల కష్టాలు నానాటికీ పెరుగుతున్నాయన్నారు. నీరో చక్రవర్తిలా మోడీ వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను పాలకులు నాశనం చేయడం దుర్మార్గమని అన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబూరావు. తాండ్ర కనకారావు. ఎం.నర్సింగరావు. శ్రీనివాసరావు, మొహిద్దీన్, నరేష్, సత్యనారాయణ, శ్రీనివాసరావు. పిఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

టిడిపి దుష్ప్రచారం : కారుమూరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల్లో వైసిపికి పెరుగుతున్న ఆదరణను చూసి తట్టుకోలేక టిడిపి దుష్ప్రచారానికి పాల్పడుతోందని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి హయాంలో స్టోర్‌లలో ఇచ్చే కందిపప్పు కోసం ఐదేళ్లలో రూ.1,605 కోట్లు ఖర్చు చేస్తే, తమ ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.3,019 కోట్లు ఖర్చు చేసిందన్నారు. టిడిపి నాయకులు ఇసుకను అడ్డగోలుగా దోచేశారని విమర్శించారు. ఇసుక దోపిడీకి అడ్డొస్తే మహిళా అని కూడా చూడకుండా తహశీల్దారు వనజాక్షిని కొట్టారని అని అన్నారు. తమ ప్రభుత్వం ఇసుక విషయంలో పారదర్శకతతో వుందన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపికి కనీసం పోటీ కూడా ఇవ్వలేమని చంద్రబాబు పొత్తుల కోసం తహతహలాడుతున్నారని విమర్శించారు. పొత్తులు అనేవి లేకుంటే చంద్రబాబుకు రాజకీయ జీవితమే లేదని ఎద్దేవా చేశారు.

ఆదిత్యపై పవన్ హర్షం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సూర్యునిపై అధ్యయనం చేసేందుకు నిర్దేశించిన ఆదిత్య ఎల్-1 అబ్జర్వేటరీని ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రయోగించడం హర్షణీయమని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదిత్య ఎల్-1 నిర్దేశిత ప్రయోజనం సాధించాలని శాస్త్రీయ విజ్ఞాన ఫలాలు అందరికీ అందే దిశగా కృషి చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

పవన్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు

జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం ట్విట్టర్ (ఎక్స్)లో పొందుపరిచారు. ప్రజల మనిషిగా, సమాజ శ్రేయోభిలాషిగా రాష్ట్ర జనహితాన్ని కోరుకునే పవన్ నిండు నూరేళ్లూ ఆరోగ్య ఆనందాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. టిడిపి నేత నందమూరి హరికృష్ణ జయంతి సందర్భంగా చంద్రబాబు ఆయనకు చంద్రబాబు నివాళులర్పించారు. సినీ రాజకీయ రంగాల్లో ఎంతోమందికి ఆత్మీయుడిగా, ప్రజా బంధువుగా, నిండైన తెలుగుదనానికి ప్రతిరూపంగా తెలుగువారి అభిమానాన్ని హరికృష్ణ పొందారని పేర్కొన్నారు.

విద్యార్థులు శక్తిసామర్థ్యాలకు పదును పెట్టాలి

- ఎస్ఆర్ఎం స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- డాక్టర్ అశుతోష్‌శర్మకు గౌరవ డాక్టరేట్



తెలంగాణా గవర్నర్ డాక్టర్ సౌందరరాజన్‌కు మెమొంటో అందజేస్తున్న వర్సిటీ యాజమాన్యం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

విద్యార్థులు తమలో అంతర్లీనంగా దాగియున్న శక్తి సామర్థ్యాలకు నిత్యం పదునుపెడుతూ ఉండాలనీ, అప్పుడే అంతర్జాతీయంగా అన్ని రంగాల్లో నెలకొన్న పోటీతత్వాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలరని తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నీరుకొండలోని ఎపిఎస్ఆర్ఎం యూనివర్సిటీ 3వ స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్నాతకోత్సవంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశేషమైన సేవలందించిన డాక్టర్ అశుతోష్ శర్మకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ ప్రదానం చేశారు. ముఖ్య అతిథి గవర్నర్ డాక్టర్ తమిళిసై, గౌరవ అధితులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం 883 మంది విద్యార్థులకు డిగ్రీలు, బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు. వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ టిఆర్ పారివేందర్ అధ్యక్షతన నిర్వహించిన స్నాతకోత్సవంలో గవర్నర్ ప్రసంగించారు. విద్యార్థులు ప్రతి రోజూ నూతన టెక్నాలజీని అలవర్చుకోవాలని చెప్పారు. యూనివర్సిటీ భవనాలను చూసి సంభ్రమాశ్చర్యానికి లోనైనట్లు పేర్కొన్నారు. తాను తెలంగాణలో 14 యూనివర్సిటీలకు ఛాన్సలర్‌నని, ఎక్కడా ఇలాంటి తరహా అంతర్జాతీయ స్థాయి ఆడిటోరియాన్ని చూడలేదన్నారు. విద్యార్థుల ఉన్నత విద్యకు మౌలిక సదుపాయాలు ప్రధానమని పేర్కొంటూ, కరోనా సమయంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వ్యాక్సినేషన్ టెస్ట్ డ్రైవ్‌కు ఎంతో సహకారం అందించిందనీ, ఈ సందర్భంగా యాజమాన్యాన్ని అభినందిస్తున్నానన్నారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ అశుతోష్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు కొత్త లక్ష్యాలతో, ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్ , వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రేమకుమార్, డీన్లు పాల్గొన్నారు.

ఐటి నోటీసులపై చంద్రబాబు మౌనం వీడాలి

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



అమరావతి నిర్మాణంలో అవినీతి డబ్బు చంద్రబాబుకు అందినట్లు ఆరోపణలపై ఆదాయపు పన్నుశాఖ ఇచ్చిన నోటీసు, దాని ఆధారంగా ప్రముఖ జాతీయ మీడియా ప్రచురించిన వార్తలపై చంద్రబాబు మౌనం వీడి వాస్తవాలను ప్రజల ముందు వుంచాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతి నిర్మాణంలో కిట్ బ్యాగ్స్ అందాయని పూర్తి సమాచారం ఉన్నందునే ఐటి నోటీసులు ఇచ్చిందన్నారు. ఈ అవినీతిపై జాతీయ మీడియా పూర్తి స్థాయిలో వార్తలు రాసిందని, దీనిపై చంద్రబాబు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. 2020, 2021లో రెండు పర్యాయాలు ఐటి నోటీసులు ఇచ్చిందన్నారు. ఎల్అండ్‌టి, షాపూర్జి పల్లోంజీ కంపెనీల ప్రతినిధి మనోజ్ దేవ్, చంద్రబాబు పిఎ శ్రీనివాస్ ఇళ్లలో ఐటిశాఖ తనిఖీలు చేసినప్పుడు ఈ అక్రమాల పుట్ట వెలుగులోకి వచ్చిందన్నారు. ఆ కంపెనీల నుంచి డబ్బు షెల్ కంపెనీలకు వెళ్లి, అక్కడ్నుంచి చంద్రబాబుకు చేరాయని అన్నారు. ఆదాయపు పన్నుశాఖ నోటీసులో ఇదే అంశాన్ని పొందుపర్చిందన్నారు. ఐటి నోటీసుల్లో నారా లోకేష్ పేరు కూడా ప్రస్తావన వుందని, పాదయాత్రలో వున్న లోకేష్ అయినా ఈ నోటీసులపై నోరుమెదపాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టును ఏకంగా ఎటిఎంగా మార్చుకున్నారని ప్రధాన మంత్రే చెప్పారని అన్నారు. ఐటి నోటీసుల్లో పేర్కొన్న లావాదేవీలు, చంద్రబాబు అవినీతిపై ఇడి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

రేపు సమరభేరీ ధర్నాలు

- జయప్రదం చేయాలని సిపిఎం పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమరభేరీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4వ తేదిన అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ ధర్నా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని కోరింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధరలు తగ్గించాలని, ఉద్యోగాలు ఇవ్వాలని, కరెంట్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ , ఈ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా ఆగస్టు 30వ తేదీ నుంచి సమరభేరీ కార్యక్రమం రాష్ట్రంలో ప్రారంభమైంది ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రోజురోజుకీ నిత్యావసర వస్తువుల ధరలు అదుపు లేకుండా ఆకాశాన్నంటుతున్నాయని పేర్కొన్నారు. రూ.450లు ఉన్న గ్యాస్ ధర రూ.1200లకు పెరిగిందని తెలిపారు. కాయగూరలు, పప్పులు, నూనెలు 50శాతం వరకు పెరిగాయని పేర్కొన్నారు. ధరలను అదుపు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం బడా వ్యాపారుల కొమ్ముకాస్తుందని విమర్శించారు. 2014 నుండి నిరుద్యోగులను మోసగిస్తూనే ఉందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల పేరుతో మోదీ, జాబ్ క్యాలెండర్ పేరుతో జగన్ ప్రభుత్వాలు యువతకు తీవ్ర అన్యాయం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంతో కుమ్మక్కై రాష్ట్ర ప్రభుత్వం కూడా 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేసిందని పేర్కొన్నారు.

దళితులకు గిరిజనులకు 200 యూనిట్ల వరకు ఇచ్చే ఉచిత విద్యుత్‌కు ఎగనామం పెడుతుందని విమర్శించారు. ప్రజలపై ప్రభుత్వాలు మోపుతున్న భారాలపై ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 1 వరకు నుంచి సంతకాల సేకరణ, సచివాలయాల్లో వినతులు, అర్జీలు వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలను వీటిపై కదలించేందుకు కృషి జరిగిందని తెలిపారు. ప్రజలు అన్నిచోట్లా కదిలి సచివాలయాల వద్ద జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారని వివరించారు.

ఇంటింటికి తిరిగి ప్రచారం చేసే సందర్భంలో పెరుగుతున్న ధరలపై ప్రజలలో తీవ్ర ఆగ్రహం కనపడిందని, నిరసనగా కదిలి పలుచోట్ల విద్యుత్ బిల్లులను దహనం చేశారని పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైఫల్యాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు

- 40 ఏళ్లలో ఇలాంటి పాలన ఎప్పుడూ చూడలేదు
- కరెంటు కోతలతో ప్రజలు ఇక్కట్లు
- 'బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ'లో చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి, కాకినాడ రూరల్

రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన ఈ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా జగన్ ఇంటికి వెళ్లడం ఖాయమని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. కరెంట్ కోతలతో వైసిపి ప్రభుత్వం ప్రజలను అనేక కష్టాలు పెడుతోందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారు. కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్ వద్ద టిడిపి జోన్-2 సమావేశం టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు మాట్లాడుతూ.. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ వంటి కార్యక్రమాలు విజయవంతం అయ్యాయని తెలిపారు. ఇటీవల జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో, పంచాయతీ ఉప ఎన్నికల్లోనూ టిడిపి గెలిచిందన్నారు. ప్రజల్లో మార్పు ప్రారంభమైందనడానికి ఈ ఎన్నికలే నిదర్శనమని చెప్పారు. రివర్స్ టెండరింగ్ విధానాన్ని తీసుకొచ్చి రాష్ట్రాన్ని సిఎం సర్వనాశనం చేశారని మండిపడ్డారు. చేతివృత్తులు, వివిధ రంగాల కార్మికుల పొట్టగొట్టిన వ్యక్తి జగన్ అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన 42 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత విధ్వంసకర పాలనను ఎప్పుడూ చూడలేదన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా విపరీతంగా ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఈ నాలుగేళ్లలో చిన్న రోడ్డు వేయలేని వైసిపి ప్రభుత్వం మూడు రాజధానులు ఎలా కడుతుందని ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లలో ఇసుకలోనే రూ.40 వేల కోట్లను వైసిపి నేతలు దోచుకున్నారని ఆరోపించారు. ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ ప్రజల వద్దకు వెళ్లాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. 45 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే కలిగే లబ్ధిని ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, యనమల రామకృష్ణుడు, బండారు సత్యనారాయణ, నిమ్మకాయల చినరాజప్ప, కెఎస్ జవహర్, తదితరులు పాల్గొన్నారు.

రాజస్థాన్‌లో అమానుషం

- భార్యను వివస్త్రను చేసి ఊరేగించిన కసాయి
- భర్తసహా ఏడుగురి అరెస్టు



నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

జైపూర్ : మణిపూర్‌లో ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించిన ఘటన మరువకముందే రాజస్థాన్‌లో మరొక దారుణ ఘటన వెలుగులోకొచ్చింది. ఓ గిరిజన మహిళ (21)ను ఆమె భర్తే విపరీతంగా కొట్టి, వివస్త్రను చేసి గ్రామంలో ఊరేగించాడు. రాజస్థాన్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లా నిచల్‌కోటా గ్రామంలో గురువారం జరిగిన ఈ ఘటనపై వీడియో వైరల్ అవడంతో, భర్తసహా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రతాప్‌గఢ్ జిల్లా ఎస్‌పి అమిత్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ కన్హా గమేటి తన భార్య అత్తింటికి రాకుండా వేరొకరితో సహజీవనం చేస్తుందంటూ ఆగ్రహంగా ఉన్నాడని చెప్పారు. ఆమెను బలవంతంగా తమ గ్రామానికి బైకుపై తీసుకొచ్చాడన్నారు.

అనంతరం ఆమెను కొట్టి వివస్త్రను చేసి ఊరేగించాడన్నారు. నిందితులను అరెస్టు చేసేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో మొత్తంగా పదిమంది పేర్లు పేర్కొన్నట్లు డిజిపి ఉమేష్ మిశ్రా తెలిపారు. బన్స్‌వారా రేంజ్ ఐజి ఆధ్వర్యాన సిట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సంఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై ప్రతాప్‌ఘడ్ ఎస్‌పి దర్యాప్తు చేసి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని తెలిపారు. సిఎం ఆదేశాల మేరకు ఎడిజి (క్రైమ్) ఎం.ఎన్.దినేష్‌ను ప్రతాప్‌ఘడ్‌కు పంపారు.

బాధితురాలికి సిఎం పరామర్శ

బాధిత ఆదివాసీ మహిళను రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ పరామర్శించారు. ఆమెకు సామాజిక, ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వ ఉద్యోగమిచ్చి, రూ.10లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని శనివారం ప్రకటించారు. ప్రతాప్‌ఘడ్ వెళ్లి ఆమెను కలుసుకున్న ముఖ్యమంత్రి ఆమె భద్రతకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిట్‌ను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. బాధితురాలి కుటుంబంతో తాను స్వయంగా మాట్లాడానని, వారికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఇది అమానవీయమైన చర్య అని ఆయన వ్యాఖ్యానించారు. తనను బలవంతంగా మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని వెళ్లి, వివస్త్రను చేసి ఊరేగించారంటూ తన భర్తపై ఫిర్యాదు చేసిన బాధితురాలి ధైర్యాన్ని ప్రశంసించిన ముఖ్యమంత్రి ఈ కేసుపై ఫాస్ట్ ట్రాక్ విచారణ చేపట్టాల్సిందిగా ఇప్పటికే ఆదేశించారు. బాధితురాలిది చాలా పేద ఆదివాసీ కుటుంబమని, వారి పరిస్థితి చూస్తే ఆవేదన కలిగిందని అన్నారు.

'జెట్ ఎయిర్‌వేస్' వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్ అరెస్టు

ముంబయి : జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్(74)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శుక్రవారం రాత్రి ముంబైలో అరెస్టు చేశారు. ఆయనను అక్రమ నగదు లావాదేవీల నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఈడీ అరెస్టు చేసింది. నరేశ్ గోయల్ జెట్ ఎయిర్‌వేస్ కోసం కెనరా బ్యాంక్ నుంచి 848.86 కోట్ల రుణాలను తీసుకున్నారని, అందులో 538.62 కోట్లను బ్యాంక్‌కి చెల్లించలేదని కెనరా బ్యాంక్ ఫిర్యాదు మేరకు గోయల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. బ్యాంక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ గోయల్ డబ్బుల్ని స్వాహా చేసినట్టు నిర్ధారించింది. ఎఫ్ఐఆర్ ఆధారంగానే ఈడీ గోయల్‌ని ప్రశ్నించి అరెస్టు చేసింది. గోయల్‌ని శనివారం ముంబయిలోని పీఎంఎల్‌ఏ కోర్టు ముందు ప్రవేశపెట్టి.. ఇడి అధికారులు ఆయనను కస్టడీ కోరే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. కాగా, మోసం, నేరపూరిత కుట్ర, నేరపూరిత విశ్వాస ఉల్లంఘన, నేరపూరిత దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని పేర్కొంటూ నరేశ్ గోయల్, అనితా గోయల్, గౌరంగ్ ఆనంద శెట్టి తదితరులపై గతేడాది నవంబర్ 11న సీబీఐకి కెనరా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ పీ సంతోష్ ఫిర్యాదు చేశారు. దీనివల్ల బ్యాంకుకు రూ.538.62 కోట్ల నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు.

సర్టిఫికెట్లపై ఆధార్ వద్దు : యుజిసి

న్యూఢిల్లీ : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. డిగ్రీలు, ప్రొవిజినల్ సర్టిఫికెట్లపై పూర్తి ఆధార్ నంబర్ ముద్రించ వద్దని వర్సిటీలకు సూచించింది. వ్యక్తిగత వివరాలు బయటకు వెళ్లే అవకాశముందన్న ఆందోళనలను పరిగణలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వర్సిటీలకు రాసిన లేఖలో పేర్కొంది. 'ఉడాయ్ నిబంధనల ప్రకారం.. ఆధార్ నంబర్‌ను కలిగి ఉన్న ఏ సంస్థ కూడా వ్యక్తి పూర్తి ఆధార్ నంబర్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టరాదు. డిగ్రీలు, ప్రొవిజన్ సర్టిఫికెట్లపై ఆధార్ నంబర్ ముద్రించటాన్ని అనుమతించం. భారత విశిష్ట ప్రాధికార సంస్థ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలి' అని యుజిసి సెక్రటరీ మనీష్ జోషి వర్సిటీలకు రాసిన లేఖలో తెలిపారు. డిగ్రీ మార్కుల మెమోలపై పూర్తి ఆధార్ నంబర్ ముద్రిస్తే అడ్మిషన్ వెరిఫికేషన్ సమయంలో సాయపడుతుందని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సూచిస్తున్నాయి. ఈ సమయంలో ఈ ఆదేశాలను జారీ చేయటం గమనార్హం.

వైఎస్ఆర్‌కు సిఎం జగన్ నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నివాళులర్పించారు. తన సతీమణి భారతితో కలిసి తాడేపల్లి నుంచి ప్రత్యేక విమానంలో కడప ఎయిర్ పోర్టుకు సిఎం చేరుకున్నారు. అక్కడి నుంచి హెలి కాప్టర్‌లో ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. తల్లి వైఎస్.విజయమ్మ, చిన్నాన్న వైఎస్.సుధీకర్‌రెడ్డి, కడప ఎంపి వైఎస్.అవినాష్‌రెడ్డితో పాటు ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్ఆర్ ఘాట్ వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి ముఖ్యమంత్రి జగన్ ఘనంగా నివాళులర్పించారు. ఘాట్ సమీపంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అంతకు ముందే సిఎం చెల్లెలు, వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్.షర్మిల తన తల్లి విజయమ్మతో కలిసి నివాళులర్పించారు.

లండన్‌కు సిఎం దంపతులు

వ్యక్తిగత పర్యటన నిమిత్తం తన బార్య వైఎస్ భారతితో కలిసి ముఖ్యమంత్రి జగన్ లండన్‌కు బయలుదేరారు. శనివారం రాత్రి 8.33గంటలకు తాడేపల్లిలోని తమ నివాసం నుండి బయలుదేరి విజయవాడలోని గన్నవరం విమానాశ్రయం నుండి లండన్‌కు వెళ్లారు. తిరిగి ఈ నెల 11న రాష్ట్రానికి రానున్నారు. జగన్ కుమార్తెలు లండన్‌లో చదువుతున్న సంగతి తెలిసిందే.

అమలాపురంలో ఉద్రిక్తత

- 200 మంది పోలీసులతో బందోబస్తు

ప్రజాశక్తి - అమలాపురం

డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రౌడీషీటర్ హత్య కేసులో ప్రధాన నిందితుడి ఇంటిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం.. మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్‌పై తిరగబడిన యువకులను రెండు రోజులుగా స్టేషన్‌లోనే ఉంచడంతో వారి బంధువులు ఆందోళనలకు దిగడంతో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తే అవకాశం ఉండటంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అమలాపురం ఈదరపల్లికి చెందిన బళ్ల సతీష్ ఇంటిని గుర్తుతెలియని దుండగులు శనివారం ధ్వంసం చేశారు. రౌడీషీటర్ పోలిశెట్టి కిషోర్ హత్యకేసులో సతీష్ ప్రధాన నిందితుడు. శుక్రవారం రాత్రి పోలిశెట్టి కిషోర్‌ను హత్య చేసిన విషయం విదితమే. మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ప్రధాన అనుచరుడు గంధం పళ్లంరాజుకు చెందిన అమలాపురంలోని రియల్ ఎస్టేట్ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నిప్పు పెట్టారు. కిషోర్ హత్యకు ప్రతీకారంగానే దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. దీంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అమలాపురం రూరల్ మండలం కామనగరువులో మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్‌పై తిరగబడిన యువకులను పోలీసులు అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం కామనగరువులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శ్రీకాంత్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు ఆయనపై తిరగబడ్డారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. రెండు రోజులుగా పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారు. రెండు రోజులైనా అరెస్ట్ చూపించలేదంటూ బాధితుల బంధువులు శుక్రవారం అర్ధరాత్రి అమలాపురం రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. నిందితులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసును నమోదు చేసిన పోలీసులు శనివారం వారిని కోర్టులో హాజరు పరిచారు. ఈ నేపథ్యంలో ఎస్‌పి ఎస్.శ్రీధర్, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ పర్యవేక్షణలో దాదాపు 200 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. అదనపు పోలీసు బలగాలను రప్పించారు.

వైద్య విద్యతోనూ జగన్ వ్యాపారం : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఎంబిబిఎస్ సీట్లను జగన్ ప్రభుత్వం సంతలో సరుకుల్లా అమ్మకానికి పెట్టడం దుర్మార్గమని టిడిపి ఎమ్మెల్యే డోలా వీరాంజనేయ స్వామి విమర్శించారు. కొత్త కళాశాలలు వస్తే తమ ఎంబిబిఎస్ కల నెరవేరుతుందనుకున్న బడుగు, బలహీనవర్గాల ఆశను చిదిమేశారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పైసలు ఇచ్చిన వారికే మెడికల్ సీట్లు కట్టబెట్టడం పెత్తందారీ ఆలోచనకాక మరేమిటని ప్రశ్నించారు. జగన్ ధన దాహానికి కొత్తగా వచ్చిన 750 సీట్లలో 168 సీట్లు పేద విద్యార్థులు కోల్పోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కంటే చైనా, ఫిలిప్పీన్స్, ఉక్రెయిన్ వంటి దేశాల్లో ఎంబిబిఎస్ చదవడం చౌక అని, అక్కడ రూ.5 లక్షలు ఖర్చయితే రాష్ట్రంలో రూ.కోటి వరకూ ఖర్చవుతుందని వివరించారు. సీట్ల అమ్మకం వద్దని జూనియర్ డాక్టర్లు లేఖ రాసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం అని అన్నారు. ఇప్పటికైనా సీట్ల అమ్మకం నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ అసమర్ధత వల్లే కరెంటు కోతలు : వర్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అసమర్ధత, అవగాహన లేమి, చేతగాని తనం వల్లే కరెంటు కోతలు విపరీతంగా పెరిగాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. ఎన్నికలకు ముందు రైతులకు తొమ్మిది గంటలు నిరాటంకంగా కరెంటు ఇస్తామని హామీ ఇచ్చి కనీసం మూడు గంటలు కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలను విసన కర్రలతో విసురుకునే పరిస్థితి నుంచి కాపాడాలని కోరారు. రైతులు నారు మడులు ఎండిపోయి ఆందోళనలో ఉన్నారని తెలిపారు. విద్యుత్ కోతలతో ఇంతటి దుర్భర పరిస్థితులుంటే సిఎం విద్యుత్‌శాఖతో ఏనాడైనా సమీక్షించారా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని విమర్శించారు. విద్యుత్ లేక ప్రజలు అల్లాడుతుంటే ఆ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గనులు తవ్వుకోవడం, ఇసుక దోచుకోవడం తప్ప కోతలు నివారించాలనే ఆలోచన, ధ్యాస లేదని అన్నారు. క్విడ్ ప్రోక్రో కింద ఏ కంపెనీ, ఏ కార్పొరేట్ సంస్థ నుంచి ఎంత విద్యుత్ కొనుగోలు చేస్తున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

పాలిటెక్నిక్ విద్యలో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు

- సాంకేతిక విద్యా మండలి నేతృత్వంలో ముద్రణ
- మార్కెట్‌లోనే కొనుగోలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాలిటెక్నిక్ విద్యలో తొలిసారి పాఠ్యపుస్తకాలను సాంకేతిక విద్య, శిక్షణ మండలి అందుబాటులోకి తీసుకొచ్చింది. పాలిటెక్నిక్ విద్యలో ఇప్పటి వరకు మండలి ఆమోదించిన పాఠ్యపుస్తకాలు లేవు. లెక్చరర్లు సిఫార్సు చేసిన పుస్తకాలను విద్యార్థులు బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి చదువుకుంటున్నారు. వీటిల్లో విషయ పరిజ్ఞానం పరంగా ఎటువంటి ప్రామాణికత లేదని సాంకేతిక విద్య, శిక్షణ మండలి అధికారులు చెబుతున్నారు. అవసరమైన పుస్తకాల ఎంపికలో విద్యార్థులు గందరగోళానికి గురవుతుండగా, ఈ పరిస్థితికి ముగింపు పలుకుతూ పుస్తకాలు సిద్ధం చేయాలని మండలి నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. అందులో భాగంగానే పాఠ్యపుస్తకాలు, ప్రయోగశాల కరదీపికల ప్రచురణ కోసం అధ్యాపక బృందాన్ని సిద్ధం చేశామని అంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి ప్రయోగశాల కరదీపికలను సేకరించి సీనియర్ అధ్యాపకులతో మండలి ఒక జాబితా సిద్ధం చేసింది. వీటి ముద్రణను ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. అయితే మార్కెట్ ధరలతో పోల్చితే తక్కువ ధరలకు పాఠ్యపుస్తకాలు లభించేలా చర్యలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుతం విద్యాసంవత్సరం (2023-24) 6 శాఖలకు సంబంధించి 17 థియరీ పాఠ్యపుస్తకాలు, 10 ల్యాబ్ మాన్యువల్స్ ప్రచురించింది. ఆటోమొబైల్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్ శాఖల్లో పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. మొదటి సంవత్సరం విద్యార్థులకు 11 పుస్తకాలు కేవలం రూ.600లకే మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయని అధికారులు చెబుతున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కూడా పుస్తకాలను సిద్ధం చేస్తామని అంటున్నారు.

సిఎం మార్గనిర్దేశకత్వంతోనే : కమిషనర్ నాగరాణి

సిఎం మార్గనిర్దేశకత్వం, ప్రభుత్వ పరమైన సహకారంతోనే తొలిదశను పూర్తిచేయగలిగామని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సిహెచ్ నాగరాణి తెలిపారు. పుస్తక ప్రచురణలో మొత్తం 46 మంది రచయితలు, 20 మంది సంపాదకులు సేవలు అందించారని పేర్కొన్నారు. నేషనల్ అక్రిడేషన్ బోర్డు మార్గదర్శకాల ప్రకారం అభ్యాస ఫలితాలకు తగినట్లుగా కంటెంట్‌ను రూపొందించామని వివరించారు. అదనపు వనరుల కోసం వెబ్ లింక్‌లు, ఆడియో విజువల్ విద్యా సమాచారానికి అనుగుణంగా డిజిటల్ లింక్‌లు పుస్తకాల్లో అందించామని తెలిపారు. పాలిటెక్నిక్ పరీక్షలతోపాటు బహుళ జాతీయ సంస్థల కంపెనీల ప్లేస్‌మెంట్ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు క్వశ్చన్ బ్యాంకులతో పుస్తకాలు అందించామన్నారు.



దుర్గమ్మను దర్శించుకున్న తెలంగాణ గవర్నర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ కనకదుర్గమ్మను తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు రాగానే ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని గవర్నర్కు అందజేశారు. అనంతరం తమిళిసై మీడియాతో మాట్లాడుతూ.. దుర్గమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమీక్షించిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధం చేయాలని ప్రకటించిందని, అందువల్ల ప్రత్యామ్నాయ ప్రణాళికలను తయారుచేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారమే ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు 50 శాతమే ఉన్నాయని, బొగ్గు నిల్వలు రెండు మూడు రోజులకు మించి లేవని, విద్యుత్ అవసరం పెరిగిందని చెప్పడం ఆందోళనకరమరమన్నారు. ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించేందుకు అన్ని స్థాయిల్లో రైతు సంఘాలతో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉన్న పంటలను కాపాడుకోవడానికి, ప్రాజెక్టుల్లో లభ్యమయ్యే నీటిని పొదుపుగా వాడి పంటలను కాపాడటానికి చర్యలు తీసుకోవాలని, విద్యుదుత్పత్తికి అవసరమైన బొగ్గు నిల్వలను పెంచాల్సి ఉందని పేర్కొన్నారు. వ్యవసాయానికి విద్యుత్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం విజ్ఞప్తి చేసింది. ప్రత్యామ్నాయ పంటల కోసం అవసరమైన నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంటలు వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని, పాడి గేదెలు, పశువులకు మేత కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుతానికి విజ్ఞప్తి చేశారు.

కర్నూలులో టమోట ప్రాసెసింగ్ యూనిట్లు

- చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- కొన్ని నెలల్లో కార్యరూపం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి



పత్తికొండ మార్కెట్లో సాగుతున్న టమోట విక్రయాలు

కర్నూలు జిల్లాలో టమోట ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ మేరకు కర్నూలు జిల్లా పత్తికొండలో ఏర్పాటు చేసేందుకు చర్యలు వేగవంతం చేసింది. పత్తికొండలో టమోట మార్కెట్ ఉండటంతో 12వేల టన్నుల సామర్థ్యంతో ఈ ప్రాసెసింగ్ యూనిట్ను ఏర్పాటు చేయనున్నారు. ప్లగ్ అండ్ ప్లే విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా 42 రకాల ప్రాసెసింగ్ కేంద్రాలను నెలకొల్పనున్నారు. రైతుల నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేసి వాటిని ప్రాసెసింగ్ చేసి పలు రకాల ఉత్పత్తులను తయారు చేయనున్నారు. తొలుత ప్రయోగాత్మకంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేసి అనంతరం వాటిని మధ్య తరహా ప్రాసెసింగ్ కేంద్రాలుగా మార్పు చేయనున్నారు. ఇందుకోసం ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి చెందిన అధికారులు బెంగళూరులో సందర్శించి అక్కడ ఈ ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించి అధ్యయనం చేయనున్నారు. ఈ కేంద్రాల్లో అరటి యూనిట్లు, ఎండుమిర్చి యూనిట్లు, తయారీ యూనిట్లుగా నెలకొల్పనున్నారు. ఈ యూనిట్ల ద్వారా టమోట కెచప్, జామ్ తయారు చేయనున్నారు. ఈ యూనిట్ల కోసం తొలుత 3.5 ఎకరాలు అవసరమని ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధికారులు జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనల ప్రకారం పత్తికొండ ప్రాంతంలో జిల్లా అధికారులు స్థలాన్ని పరిశీలించి, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి అప్పగించనున్నారు. రైతులు సొసైటీలుగా ఏర్పడి ఈ కేంద్రాలకు టమోట సరఫరా చేసేలా మరోవైపు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోనూ ఈ విధమైన ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. సత్యసాయి జిల్లాలోని తనకల్లు, అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, కళ్యాణదుర్గంలో ఈ కేంద్రాల ఏర్పాటుకు క్లస్టర్లను ఏర్పాటు చేసేందుకు ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధికారులు చర్యలు చేపట్టారు.

రైతులకు సోలార్ డ్రయర్లు

ప్రాసెసింగ్ యూనిట్లు ఒక వైపు ఏర్పాటు చేస్తూనే మరో వైపు మహిళా రైతులకు సోలార్ డ్రయర్లను అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇది ఇప్పటికే కొన్ని కార్యరూపం దాల్చనున్నట్లు తెలుస్తోంది. 3500 సోలార్ డ్రయర్లు అందించి వాటి ద్వారా టమోట, ఉల్లి వంటి వాటి నుంచి చిప్స్ వంటి ఉత్పత్తులను తయారు చేసేలా ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ చర్యలు చేపట్టింది.



రక్తదానంతో జీవితాల్లో వెలుగు

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రక్తదానంతో ఎంతో మంది జీవితాల్లో వెలుగును నింపవచ్చని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. జనసేన అధ్యక్షులు పవన్కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన నాదెండ్ల మనోహర్ కూడా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారందరికీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ.. గుంటూరు జిజిహెచ్ ఆస్పత్రి వైద్యుల బృందం దాతల నుంచి సేకరించిన బ్లడ్ యూనిట్స్ను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, చేనేత వికాస విభాగం ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, డాక్టర్స్ సెల్ ఛైర్మన్ పాకనాటి గౌతమ్రాజ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుల వృత్తులను కాపాడుతాం

- 'ఆదరణ'ను సమర్థవంతంగా కొనసాగిస్తాం : లోకేష్

ప్రజాశక్తి - ఉంగుటూరు (ఏలూరు జిల్లా)

బిసి కులాలను ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి తీవ్ర నిర్లక్ష్యం చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పాదయాత్ర 202వ రోజు శనివారం ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలో కొనసాగింది. ముందురోజు తూర్పుగోదావరి జిల్లాలో సాగిన యాత్ర ఉదయం 11 గంటలకు ఏలూరు జిల్లాలోకి ప్రవేశించింది. టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, పార్టీ ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు లోకేష్కు ఘన స్వాగతం పలికారు. నీలాద్రిపురంలో బిసి నేతలు లోకేష్ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్మోహన్రెడ్డి యాదవులతోపాటు అన్ని బిసి కులాలను తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. బిసి సబ్ ప్లాన్ నిధులు రూ.75,790 కోట్లు దారిమళ్లించారని, కులానికొక కుర్చీలేని కార్పొరేషన్ ఏర్పాటు చేసి తీరని అన్యాయం చేశారని విమర్శించారు. టిడిపి హయాంలో యాదవ కార్పొరేషన్ ద్వారా రూ.278 కోట్లు, పశుసంవర్ధకశాఖ ద్వారా జీవాల కొనుగోలుకు రూ.395 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కుల వృత్తులను కాపాడతామని స్పష్టం చేశారు. 22 గొర్రెలను యూనిట్గా తీసుకుని పంపిణీ చేస్తామని, బీమా సౌకర్యం కల్పిస్తామని, సబ్సిడీపై ఆవులు, గొర్రెలు అందిస్తామని ప్రకటించారు. యాదవులు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఉంగుటూరులో బిసి సామాజిక తరగతి ప్రతినిధులతో లోకేష్ మాట్లాడుతూ బిసిలను పేదరికం నుండి బయటకు తీసుకురావడమే తమ విధానమని స్పష్టం చేశారు. ఆదరణ పథకాన్ని ప్రవేశపెట్టి కుల వృత్తులను కాపాడామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి సీనియర్ నేతలు లోకేష్ సమక్షంలో టిడిపిలో చేశారు.

ప్రజల హృదయాల్లో వైఎస్ఆర్ది చెరగని ముద్ర : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అందించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తెలుగు రాష్ట్రాల్లోని కోట్లది మంది ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయం వద్ద వైఎస్ రాజశేఖర్రెడ్డి వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి సజ్జలతోపాటు మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నవరత్నాల అమలు కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, సలహాదారులు జూపూడి ప్రభాకర్, నారిమల్లి పద్మజ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లేళ్ల అప్పిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సజ్జల మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నపుడు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108 వంటి పథకాలు ఇప్పటికీ దేశంలో ఆదర్శంగా వున్నాయన్నారు. పేదలకు మేలు జరగాలన్న లక్ష్యంతో వైఎస్ఆర్ చేపట్టిన కార్యక్రమాలను ఆయన వారసుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి మరింత ముందుకు తీసుకెళు తున్నారని అన్నారు.

కౌలు రైతులందరికీ రైతు భరోసా

- కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 32 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని ప్రొఫెసరు రాధాకృష్ణ కమిషన్ చెప్పిందని, కౌలు రైతుందరికీ రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెరుగుతున్న కౌలు రీత్యా వీరిలో కనీసం 15 లక్షల మంది భూమిలేని కౌలు రైతులుంటారని ఒక అంచనా అని, రాష్ట్ర ప్రభుత్వం షరతులు పెట్టి కేవలం 1,46,324 మందికి మాత్రమే రైతు భరోసా జమ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఒకవైపు 99 శాతం వాగ్దానాలను అమలు చేసినట్లుగా ప్రచారం చేసుకుంటూ.. కౌలు రైతుల విషయంలో కనీసం 10 శాతం కూడా వాగ్దానాన్ని అమలు చేయలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని అన్నారు. ఎకరం లోపు కౌలు చేస్తూ సొంత భూమి లేని కౌలు రైతులకు రైతు భరోసా వర్తించడం లేదని, ఒక రైతు వద్ద ఒకరికి మించి నలుగురు, ఐదుగురు కౌలు చేస్తుంటే వారిలో ఒకరికి మాత్రమే రైతు భరోసా ఇవ్వడం అన్యాయమని అన్నారు. భూమి లేని ఒసి రైతులకు కూడా రైతు భరోసా వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. చట్టంలో అవసరమైన సవరణలు చేసి, నిబంధనలు మార్చి కౌలు రైతుకు రైతు భరోసా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

ఆకాష్కు కొత్త సారథులు..!

న్యూఢిల్లీ : విద్యాసంస్థ ఆకాష్ సిఇఒ, సిఎఫ్ఒలు రాజీనామా చేయడంతో దాని మాతృసంస్థ బైజూస్ నూతన నాయకత్వం నియామకానికి ఓ ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవల ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ (ఎఇఎస్ఎల్) హెడ్ అభిషేక్ మహేశ్వరి, సిఎఫ్ఒ విపన్ జోషి వైదొలగడంతో ఆ రెండు స్థానాలు కలిగి ఉన్నాయి. కీలకమైన ఈ హోదాల్లో కొత్త సారథుల కోసం కమిటీని నియమిస్తూ బైజూస్ సిఇఒ రవీంద్రన్ నిర్ణయం తీసుకున్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల ఎదుట నిరసనలు
- అధికారులకు వినతి పత్రాలు అందజేత
- కొనసాగిన సిపిఎం సమరభేరి

ప్రజాశక్తి-యంత్రాంగం



నెల్లూరులో ధర్నా

అధిక ధరలు, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, నిరుద్యోగుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం నేతలు ఆందోళనలు చేశారు. ఆయా సచివాలయాల ఎదుట నిరసనలు తెలిపి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సమరభేరీ పేరుతో సిపిఎం చేపట్టిన ప్రచారం శనివారమూ కొనసాగింది. విద్యుత్ భారాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు వారపు సంతలో నిర్వహించిన ర్యాలీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర పాల్గొన్నారు. అనంతగిరి మండలం ఎగువ శోభ పంచాయతీ కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనకాపల్లిలో గ్రామ సచివాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి, వినతిపత్రాలు అందజేశారు. విశాఖ జిల్లా తగరపువలస, కొమ్మాది, చినగంట్యాడ, దశమకొండ, బిసి రోడ్డు, క్రాంతినగర్, చింతల్లోవ, కాకరలోవ సచివాలయాల వద్ద విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. గుంటూరు 31వ వార్డు సచివాలయం, తెనాలి తహశీల్దార్ కార్యాలయం వద్ద 4వ తేదీన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రచారం నిర్వహించారు. పల్నాడు జిల్లాలో సచివాలయాలలో వినతి పత్రాలు అందజేశారు. అచ్చంపేటలో కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడులో ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం చేశారు. చిత్తూరు జిల్లా పలమనేరు ఆర్డిఒ కార్యాలయం వద్ద ధర్నా, సచివాలయాల వద్ద నిరసనలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై అనంతపురంలో సంతకాల సేకరణ చేపట్టారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా సచివాలయాల ఎదుట నిరసన తెలిపి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, కృష్ణ, ఎన్టిఆర్ జిల్లాల్లో ధర్నాలు చేపట్టారు. నెల్లూరు జనార్ధన్రెడ్డి కాలనీలో విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు.

'ఆ' వ్యాపారాలతో జాగ్రత్త

- ఇంటలిజెన్స్ హెచ్చరిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పెట్టుబడులు పెడితే అత్యధిక తిరుగు చెల్లింపులు ఇస్తామంటూ చేసే వ్యాపారాల(పాంజీ) పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇంటిలిజెన్స్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఇటీవల రూపొందించిన నివేదికలో ఆ తరహా మోసాలు రాష్ట్రంలోనూ అధికమవుతున్నట్లు గుర్తించారు. ఏయే రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారో తమ నివేదికలో ఇంటిలిజెన్స్ అధికారులు పేర్కొన్నారు. దీంతో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో సైతం అంశం చర్చకు వచ్చింది. కొన్ని బ్యాంకులు సొంతంగా ఈ తరహా మోసాలపై అధ్యయనం చేస్తున్నాయి. ప్రధానంగా తమ పథకాల్లో పెట్టుబడుతులు పెడితే బ్యాంకులు ఇచ్చేదానికన్నా అధిక రిటర్న్స్ ఇస్తామంటూ లబ్దిదారులకు ఆ సంస్థలు వాగ్దానాలు చేస్తున్నాయి. అలాగే లబ్దిదారులు తమ స్నేహితులను, బంధువులను చందాదారులుగా చేర్పినా, ఈ సంస్థలకు పంపిణీదారులను చేర్పించినా భారీ రివార్డులు, నజరానాలు ఇస్తామని కూడా ప్రకటనలు చేస్తున్నారు. గుర్తింపులేని, అపరిచిత వెబ్సైట్లను ఉపయోగిస్తూ ఉచిత సర్వీసులను కూడా ఇస్తామంటూ చెబుతున్నారని గుర్తించారు. ఇదే సమయంలో వ్యాపారానికి సంబంధించి అత్యుత్తమ ఆఫర్లు ఉన్నాయని, అవి కూడా నిర్ణీత కాలానికేనని చెబుతూ లబ్దిదారులను ఆకర్షించే ప్రయత్నాలు జోరుగా చేస్తున్నారని పేర్కొన్న నిఘా వర్గాలు అవి పూర్తిగా మోసపూరితమైనవని తెలిపారు. వ్యాపార సంస్థలు నియమించుకుంటున్న ఏజెంట్లకు కూడా రిజర్వ్బ్యాంకు, సెబి, ఐఆర్డిఎఐ, ఎన్హెచ్బి వంటి ఆర్థిక సంస్థల అనుమతుల్లేవని తెలిపారు.

గుడివాడ వైసిపిలో విబేధాలు

- ఎంపి సమక్షంలోనే బాహాబాహీ

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి, గుడివాడ

కృష్ణాజిల్లా గుడివాడ వైసిపిలో అంతర్గత విబేధాలు భగ్గుమన్నాయి. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి సమక్షంలోనే వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతరావు, ఆ పార్టీకి చెందిన వడ్లాని సుధాకర్ బాహాబాహీకి దిగారు. గుడివాడ మున్సిపల్ కార్యాలయం వద్ద నూతన పింఛనుల పంపిణీ కార్యక్రమంలో మచిలీపట్నం ఎంపి బాలశౌరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జరుగుతున్న సమయంలోనే హనుమంతరావుతో ఎంపి అనుచరుడు వడ్లాని సుధాకర్ ఘర్షణకు దిగారు. ఎంపి ఇద్దరినీ వారించే ప్రయత్నం చేసినా నాయకులు వినిపించుకోలేదు. విషయం తెలుసుకున్న హనుమంతరావు అనుచరులు భారీ సంఖ్యలో మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకోవడంతో సుధాకర్ అక్కడి నుంచి పరారయ్యారు. హనుమంతరావు అనుచరులు ఆగ్రహంతో సుధాకర్ వాహనాన్ని ధ్వంసం చేశారు. గుడివాడ నెహ్రూ చౌక్ సెంటర్లో హల్చల్ చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితి చేయిదాటిపోకుండా హనుమంతరావుకు సర్ది చెప్పారు. సినీనటుడు, మాజీ ఎంపి కైకాల సత్యనారాయణ విగ్రహ ఏర్పాటు వ్యవహారంలో ప్రాధాన్యతపైనే ఇద్దరు నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు చర్చించుకుంటున్నారు.

ప్రజల నాడి తెలిసిన నేత వైఎస్ఆర్

- నాడు వ్యవసాయ సంక్షోభాన్ని చూసి చలించారు
- 'రైతే రాజైతే' పుస్తకావిష్కరణలో పాలగుమ్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ సంక్షోభ సమయంలో పాదయాత్ర చేపట్టిన వైఎస్ రాజశేఖరరెడ్డి రైతుల కష్టాలను చూసి చలించిపోయారని ప్రముఖ పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్ చెప్పారు. వైఎస్ఆర్ ప్రజల నాడి తెలిసిన నేత అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంపై ప్రతికూల విధానాలు అమల్జేస్తోందని, వైఎస్ఆర్ బతికివుంటే సంక్షోభ నివారణకు కృషి చేసేవారని తెలిపారు. రైతు సమస్యలు, రైతు ఉద్యమాల పట్ల వెంటనే స్పందించేవారని సాయినాథ్ గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్లోని ఓ ప్రముఖ హోటల్లో మాజీ ఎంపీ కెవిపి రామచంద్రరావు, మాజీ వ్యవసాయశాఖ మంత్రి రఘువీరారెడ్డి రచించిన 'రైతే రాజైతే...వ్యవసాయం పండుగే' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ ఆయా కంపెనీలు విత్తనాల ధరలు పెంచినప్పుడు అధికారంలోకి వచ్చాక వాటిని తగ్గించారని తెలిపారు. మోన్శాంటో లాంటి విత్తన కంపెనీ మెడలు వంచి ధరలు తగ్గించేలా చేశారని గుర్తు చేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న కేంద్ర ప్రభుత్వం...రైతులను కష్టాలపాలు చేసిందన్నారు. దుర్మార్గమైన మూడు వ్యవసాయ చట్టాలను మోడీ సర్కార్ తీసుకొస్తే వాటిని మహోద్యమంతో రైతన్నలు తిప్పికొట్టారని సాయినాథ్ తెలిపారు. ఆ ఉద్యమంలో దాదాపు 725 మంది రైతులు చనిపోయారని వివరించారు.

మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ వైఎస్ఆర్తో తన అనుబంధం విడదీయరానిదని తెలిపారు. నక్సలైట్లతో చర్చలు జరిపి వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడంలో ఆయన కీలక భూమిక పోషించారని చెప్పారు. 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే జలయజ్ఞం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. ఆయన మరణించకపోతే తెలుగు రాష్ట్రాలు మరోలా ఉండేవన్నారు. ఆయన బతికుంటే వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో ధర్నా నిర్వహించేవారని తెలిపారు. సిపిఐ జాతీయ నేత డాక్టర్ కె నారాయణ మాట్లాడుతూ వైఎస్ఆర్తో విపక్షాలు విభేదించినా గౌరవించేవారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి నరసింహరెడ్డి, టిపిసిసి అధ్యక్షులు, ఎంపీ రేవంత్రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రరాజు, సిఎల్పి నేత మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి నేత కొప్పుల రాజు తదతరులు పాల్గొన్నారు.

300 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)


300 కిలోల గంజాయిని అల్లూరి జిల్లా కొయ్యూరు పోలీసులు శనివారం పట్టుకున్నారు. పది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రాజారావు కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నుంచి అటవీ మార్గం గుండా గంజాయిని తీసుకొచ్చి కొయ్యూరు మండలంలోని గుమ్మడివానిపాలెం శివారు జీడితోటలో డంప్ చేశారు. అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం మీదుగా తుని జాతీయ రహదారికి తరలించి అక్కడ విక్రయించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ విషయం పోలీసులకు చేరడంతో దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో అల్లూరి జిల్లా కొయ్యూరు మండలానికి చెందిన ఎనిమిది మంది, అనకాపల్లి జిల్లా దుర్గాడ గ్రామానికి చెందిన ఒకరు, జికె.వీధి మండలం దారకొండకు చెందినవారు ఒకరు ఉన్నారు. వీరి నుంచి కారు, స్కూటీ, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కొత్తపల్లి (నంద్యాల)

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..నందికుంట గ్రామానికి చెందిన వంగల సుబ్బారెడ్డి (49) గత ఏడాది 15 ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. ఈ ఏడాది కూడా ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేశారు. గత ఏడాది అధిక వర్షాలతో 15 ఎకరాల్లో వేసిన పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. వర్షాభావం వల్ల ఈ ఏడాది కూడా పంటలు ఎండిపోయాయి. పంటల సాగు నిమిత్తం సుమారు రూ.ఆరు లక్షలు అప్పు చేశారు. అప్పులు తీరే దారిలేక గత నెల 30న పురుగుమందు తాగారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహాయంతో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మరణించారు. మృతునికి భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొటాక్ మహీంద్రా బ్యాంక్ సిఇఒ రాజీనామా



న్యూఢిల్లీ : ప్రముఖ ప్రయివేటు రంగ విత్త సంస్థ కొటాక్ మహీంద్రా బ్యాంక్ సిఇఒ, మేనేజింగ్ డైరెక్టర్ హోదాలకు ఉదయ్ కొటక్ రాజీనామా చేశారు. శనివారం ఆయన తన రాజీనామాకు సంబంధించిన లేఖను సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. 2023 డిసెంబర్ వరకు ఆయన పదవీకాలం ఉన్నప్పటికీ ముందే ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే తాను సంస్థలో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా, ముఖ్య వాటాదారుగా కొనసాగనున్నట్లు వెల్లడించారు. తాత్కాలిక ఎండిగా ప్రస్తుత జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ గుప్తా వ్యవహరించనున్నారు. డిసెంబర్ వరకు తనకు గడువు ఉన్నప్పటికీ సులువుగా అధికార మార్పిడి జరగాలన్న ఉద్దేశంతో తాను స్వచ్ఛందంగా తప్పుకుంటున్నానని అన్నారు. 1985లో ఎన్బిఎఫ్సిని స్థాపించిన ఉదయ్ కోటక్.. 2003 నాటికి పూర్తి స్థాయి కమర్షియల్ బ్యాంక్ కార్యకలాపాల్లోకి మార్చారు. 2024 జనవరి 1 తర్వాత కొటక్ బ్యాంక్కు కొత్త సిఇఒ నియమితులు కానున్నారని ఆ వర్గాలు తెలిపాయి.

సంపాదకీయం

మాస్టారు

కాళిదాసు 'మాళవికాగ్ని మిత్రము' నాటకంలో-ఇద్దరు అధ్యాపకులుంటారు. సంగీత సాహిత్యాది విషయాలలో వీరిద్దరూ అగ్రగణ్యులు. ఇరువురిలో ఎవరు గొప్ప అనేది తేల్చడం ఎవరివల్లా కాలేదు. చివరికి ఈ అధ్యాపకుల్లో ఎవరు గొప్ప అనేది తేల్చమని రాజుగారు మంత్రికి బాధ్యత అప్పగిస్తాడు. మంత్రిగారు ఆ అధ్యాపకుల ప్రధాన శిష్యులను రప్పించి, పాండిత్యంలో పోటీ నిర్వహిస్తాడు. ఈ పోటీలో గెలిచిన శిష్యుడి గురువును విజేతగా ప్రకటిస్తాడు. ఉపాధ్యాయుడి ఘనత అతని శిష్యులు సాధించే విజయం మీద, నడవడిక మీద ప్రతిబింబిస్తుందని మహాకవి కాళిదాసు చెబుతాడు. 'జీవితం అంటే ఏమిటో బోధించిన నా ఉపాధ్యాయుడు అరిస్టాటిల్‌కి ఎప్పుడూ ఋణపడి వుంటాను. తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే...నా గురువు నాకు జీవితాన్నిచ్చాడు' అంటాడు అలెగ్జాండర్. సమాజంలో గురువు పాత్ర ఎప్పుడూ విశిష్టమైనదే. అందుకే 'మాతృ దేవోభవ.. పితృ దేవోభవ... ఆచార్య దేవోభవ...' అని తల్లిదండ్రుల తర్వాతి స్థానాన్ని గురువుకిచ్చారు. ఏ ఉత్తమ గురువు కూడా...ఒక్క పాఠ్యాంశాలను బోధించడంతోనే సరిపెట్టుకోరు. ఉన్నతమైన ఆశయాలను బోధిస్తారు. ఆ ఆశయ సాధన దిశగా దిశానిర్దేశం చేస్తారు. ప్రపంచ గమనాన్ని అవగతం చేస్తారు. సమాజ స్థితిగతులను అధ్యయనం చేసి, నవతరానికి ప్రగతిబాట అవుతారు. తన శిష్యుల ఎదుగుదలకు నిచ్చెన మెట్టవుతారు.

'యతో హస్త: తతో దృష్టి: / యతో దృష్టి: తతో మన:' అని సాగరసంగమం సినిమాలో కమల్‌హాసన్ చెబుతాడు. తన శిష్యురాలు తనను ద్వేషిస్తుందని తెలిసినా, ఆ విద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్న ఆశయంతో తన గురుత్వాన్ని ప్రదర్శిస్తాడు. చేత్తో రాస్తేనే దృష్టి అక్కడ నిలుస్తుంది. దృష్టి నిలిస్తేనే మనసు నిమగ్నం అవుతుంది అని ఆ శ్లోకం చెబుతుంది. 'చదువు మనిషిని సంపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది, చర్చ సంసిద్ధ మానవుడిగా తీర్చిదిద్దుతుంది, రాత కచ్చితమైన మానవునిగా తీర్చిదిద్దుతుంది' అని 16వ శతాబ్దినాటి బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు ఫ్రాన్సిస్ బేకన్ అన్నాడు. నాలుగు గోడల మధ్య ఉన్నత సమాజాన్ని తీర్చిదిద్దే రూపశిల్పి గురువు. రాయని చదువు నిరర్థకం అని, తరగతి గదిలో అభ్యసించే చదువే ఉత్తమమని, తరగతి గదిలో ఉపాధ్యాయుని బోధనకు మరేదీ ప్రత్యామ్నాయం కాదని అనేక సర్వేలు చెబుతున్నాయి. ఆన్‌లైన్ చదువులు, సాంకేతిక విజ్ఞానం అవసరమే. సాంకేతికతను స్వాగతించాల్సిందే. కానీ, ఆడియో బుక్ వింటే... చదవడం అవుతుందా? ఆన్‌లైన్ క్లాసులు చూస్తే... చదివినట్లవుతుందా? ఇప్పటికే కార్పొరేట్లను విద్యారంగంలోకి అనుమతించి విద్యను వ్యాపారమయం చేశారు. 'నూతన విద్యా విధానం' అంటూ ప్రభుత్వాలు రకరకాల విన్యాసాలు చేస్తున్నాయి. వీటికి తోడు... విద్యార్థులు తక్కువగా వున్నారనే పేరుతో పాఠశాలల విలీనం చేయడం, ఉపాధ్యాయులు వేతనాల కోసం ప్రతినెలా ఎదురుచూడాల్సి రావడం, ఉపాధ్యాయులకిచ్చే అరకొర సదుపాయాల్లో సైతం కోత విధించడం వంటి అనేక సమస్యలు అధ్యాపకులకు శిరోభారంగా మారాయి.

'ఏ దేశ భవిష్యత్ అయినా... ఆ దేశ పాఠశాలల తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుంది' అంటారు విద్యావేత్త కొఠారి. సమాజంలో మనిషి తలరాత మార్చేది చదువు. ఆ చదువుకు బలమైన పునాదులు నిర్మించేది గురువు. అలాంటి ఒక సుహృద్భావ వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. లౌకిక విలువలకు వలువలిప్పి నడివీధిలో నడిపిస్తున్న కౌరవ క్రౌర్యానికి... విలువలను నేర్పాల్సింది ఉపాధ్యాయులే. 'జీవితంలో ఒక్కసారైనా ఒక గొప్ప అధ్యాపకుడి చేతిలో పడితే, ఆ వ్యక్తి గొప్ప నాగరికుడిగా మారే అవకాశం వుంది' అంటాడు బెర్ట్రాండ్ రస్సెల్. విద్యావ్యవస్థను శరవేగంగా కాషాయీకరిస్తోన్న ప్రస్తుత తరుణంలో ఇలాంటి గొప్ప గురువుల అవసరం సమాజానికి ఎంతో వుంది. 'బండరాతిని శిల్పఖండముగ మలచి/ చెలువమ్ము గూర్చెడు శిల్పి రీతి' అని ఓ కవి అన్నట్టు...తన వ్యక్తిత్వంతో విద్యార్థులను ప్రభావితం చేయగలిగిన ప్రతి గురువూ... విద్యార్థుల మనసుల్లో చిరస్థాయిగా మిగిలిపోతాడు. వేలాది మంది ఉత్తమ నాయకులను ఈ దేశానికి అందించిన గురువులందరికీ 'ఉపాధ్యాయ దినోత్సవం' శుభాకాంక్షలు. మళ్లీ అటువంటి వారసత్వాన్ని నిర్మించేందుకు ఉపాధ్యాయులంతా కంకణం కట్టుకోవాలి.

మహనీయుల మాట




జ్ఞానాన్ని అందించే మాటలు ఆభరణాల కంటే గొప్పవి.

- బేగం హజరత్ మహల్

సమైక్య వ్యూహంతో 'ఇండియా' - జమిలి ఆత్రంలో మోడీ

ప్రస్తుతం





తెలకపల్లి రవి

2023 జులైలో బెంగళూరులో ప్రతిపక్షాల కూటమి సమావేశమై 'ఇండియా'గా ముందుకు వస్తున్న తరుణంలోనే కేంద్ర పాలక పక్షమైన బిజెపి హడావుడిగా ఎన్‌డిఎను పునరుద్ధరించి విస్తరించి ఢిల్లీలో సమావేశపర్చింది. 26 పార్టీలు ఇక్కడ కలుస్తుంటే అక్కడ ఏకంగా 38 పార్టీలు హాజరైనాయి గాని వాటి సీట్ల బలం నామకార్థమని మీడియా విశ్లేషించింది. తాజాగా ముంబయిలో ఇండియా సమావేశమవుతుందంటే ఎన్‌డిఎ సమావేశం కాకుండా ఏకంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలనే పిలవాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. లౌకిక ప్రతిపక్షాల ఐక్యవేదిక ఏర్పాటు పట్ల ప్రధాని మోడీ ఎంతగా ఉలిక్కిపడుతున్నారో దీన్నిబట్టే చెప్పొచ్చు. నవంబరు, డిసెంబరులో అయిదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలలో తన పరిస్థితి ప్రతికూలంగా వుంటుందని భయపడుతున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ పరివారం ముందస్తు ఎన్నికలకు వెళ్లవచ్చుననే సంకేతాలు గతం నుంచి వున్నాయి. కానీ ముంబయి సమావేశ సన్నాహాలు, ప్రతిపక్షాల వ్యూహాల ఉధృతి చూసిన తర్వాత కేంద్రం దాదాపు ముందస్తును మరింత ముందుకు జరపాలని నిర్ణయించుకోవలసి వచ్చిందని ఇప్పుడు అందరూ భావిస్తున్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకూ లోక్‌సభ అమృతోత్సవ్ ప్రత్యేక సమావేశాలు జరిపి కీలకమైన బిల్లులు, సవరణలు ఆమోదింపచేసుకోవాలని మోడీ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు జాతీయ మీడియా ఏకకంఠంతో చెబుతున్నది. ఇందుకు తగినట్టే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నాయకత్వంలో జమిలి ఎన్నికల గురించి అధ్యయనం చేసేందుకు ఒక కమిటీనే నియమించారు. 2018లో కోవింద్ ఆ పదవిలో వున్నప్పుడు ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో లోక్‌సభకూ శాసనసభలకూ ఒకేసారి ఎన్నికలు జరిగితే మంచిదన్న సూచన చేశారు. అంటే కేంద్రం ఆలోచనను వినిపించారు. ఆయన నాయకత్వంలో కమిటీ ఇక ఏమి చెబుతుందో ఊహించడం కష్టమేమీ కాదు. అసలు రాజ్యాంగ అధినేతగా పనిచేసిన ఒక మాజీ రాష్ట్రపతికి ఈ విధంగా రాజకీయ బాధ్యత అప్పగించడం దేశ రాజకీయాలలో ఇదే తొలిసారి కావచ్చు.

వాస్తవికత, విశాల వ్యూహం

'ఇండియా' సమావేశం జరుగుతుందనగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ప్రకటన రావడంతో దాని నిర్వహణ కోణంలోనే కొంత మార్పు అవసరమైంది. బిజెపి మత రాజకీయాలనూ కేంద్రం నిరంకుశత్వాన్ని ఓడించడానికి మరింత సమిష్టిగానూ సమర్థంగానూ సత్వర వ్యూహాలు రూపొందించుకోవాలని ప్రతిపక్షాల నాయకులు గుర్తించారు. కీలక నేతలందరూ హాజరైనారు కూడా. దేశంలోని 450 నియోజక వర్గాలలో బిజెపికి వ్యతిరేకంగా ఒకే అభ్యర్థిని నిలబెట్టి ఓడించాలని అందుకే తొలి అంశంగా నిర్ణయించుకున్నారు. అయితే ఇది విశాల ప్రతిపక్ష వేదిక మాత్రమే గనక వీలైనంతవరకూ కలసి పోటీ చేస్తామని ప్రకటించాయి. అందుకే జాతీయ స్థాయి సమావేశంలో గాక రాష్ట్రాల స్థాయిలోనే సమన్వయ కమిటీల ద్వారా ఎవరు ఎలా పోటీ చేయాలన్నది ఖరారు చేయాలని నిర్ణయించారు. ఆ నిర్ణయం వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. ఉదాహరణకు కేరళలో ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ కలసి పోటీ చేయడం కుదిరేపని కాదు. బెంగాల్‌లో మమతా బెనర్జీని వామపక్షాలు, కాంగ్రెస్ ఆమోదించడం అసాధ్యం. పంజాబ్, ఢిల్లీ, గుజరాత్‌లలో ఆప్, కాంగ్రెస్ పోటీ పడుతుంటాయి. అందుకే వీలైనంత వరకూ కలసి అన్నారు. వాస్తవానికి మమతా బెనర్జీ ఈ విషయమై తొందరగా ఉమ్మడి పోటీ విషయం తేల్చాలని పట్టుపట్టినా మిగిలిన నేతలు ఇందుకోసం సర్దిచెప్పినట్టు కథనాలు వచ్చాయి. ఏమైనా అరడజను ముఖ్యమంత్రులు, నాలుగు జాతీయ, పలు ప్రాంతీయ పార్టీల నాయకులు ఈ వేదికలో వున్నారు గనక ఆయా చోట్ల కలసి అడుగేయడం సాధ్యమే అవుతుంది. 1977లో ఇందిరా గాంధీ ఎమర్జన్సీని ఓడించేందుకు ప్రతిపక్షాలు ఆ విధంగా కలిసి విజయవంతమైన అనుభవం వుంది. కనీసం మూడు సార్లు కేంద్రంలో కాంగ్రెస్, బిజెపి యేతర ప్రభుత్వాలు ఏర్పడిన వాస్తవం మర్చిపోరానిది. అవి విఫల ప్రయోగాలుగా చెబుతుంటారు గాని అందుకు నాటి కాంగ్రెస్ అనుసరించిన విధానమే ముఖ్య కారణం. ఇప్పుడు ఆ పార్టీయే 'ఇండియా' కూటమిలో ఒక కీలక పాత్రధారి. ప్రాంతీయ పార్టీలకు అప్పటికన్నా ఇప్పుడు నిర్ణయాత్మక పాత్ర వుంటుంది. ఈ పార్టీల ఊగిసలాటనే గతంలో బిజెపి అధికారంలోకి రావడానికి ఒక ప్రధాన ఆధారమైంది. మోడీ హయాంలో రాష్ట్రాలను గుప్పిట పెట్టుకునే ధోరణి, సమాఖ్య విధానానికి తూట్లు పొడవడం ఈ ప్రాంతీయ పార్టీలలో చాలా వాటికి కళ్లు తెరిపించిందని చెప్పాలి. తమ అస్తిత్వం కోసమైనా వారంతా 'ఇండియా' వైపు మొగ్గడం అనివార్యమైన పరిస్థితి. ఇప్పటికీ వైసిపి, టిడిపి, బిజెడి వంటి పార్టీలు బిజెపికి అనుకూలంగా వుండటం వాటిపై ఒత్తిళ్ల ఫలితమే. ఇక బిఆర్‌ఎస్, బిఎస్‌పి వంటి పార్టీలు సమదూరమని అంటున్నా ఆచరణలో బిజెపికే ప్రయోజనమనే భావన వుంది. ఎన్నికలు దగ్గర పడే కొద్ది అంతిమంగా ఎవరు ఎలాంటి వైఖరి తీసుకుంటారో చూడవలసిందే. అకాలీదళ్, బిఎస్‌పి వంటి పార్టీలు 'ఇండియా'లో చేరకపోయినా ఎన్‌డిఎలో చేరడం జరగదనే అభిప్రాయం ఎన్‌సిపి నాయకుడు శరద్ పవార్ ముందే స్పష్టంగా ప్రకటించారు. ఒక కన్వీనర్ నియామకం కూడా ఇప్పుడే తేలకపోయినా నష్టం లేదని వాయిదా వేశారు.

కోవింద్ కమిటీ, కోటి కౌటిల్యాలు

ఏమైనా ఈ సమావేశ ప్రభావం అప్పుడే బిజెపిపై పడిందని సీతారాం ఏచూరి చేసిన వ్యాఖ్య అర్థవంతమైంది. ముంబయి సమావేశం ఒకవైపున ఇంకా జరుగుతుండగానే ఏకకాల ఎన్నికల ముచ్చట ఊపందుకోవడంలో అది కనిపిస్తుంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్‌ను కలిశారు. 'ఇండియా' అనే పేరు మార్చి భారత్‌నే వాడాలని భగవత్ రెండు చోట్ల వేర్వేరు సమావేశాల్లో ప్రవచించారు. ఈ దేశం హిందూ రాష్ట్రమేనని, భారతీయులందరూ హిందువులేనని మత భాష్యాన్ని మరింత తీవ్రంగా వినిపించారు. రామ్‌నాథ్ కోవింద్ కూడా కొంత కాలం కిందట భగవత్‌తో సమావేశమైనారని ఇక్కడ గుర్తు చేయాలి. అంటే మోడీ అమిత్ షా ఒకవైపు ఎన్‌డిఎ విస్తరణ కోసం తంటాలు పడుతుంటే మరోవైపు మోహన్ భగవత్ హిందుత్వ మతతత్వ సిద్ధాంతం వ్యాప్తి బీజాలు వేస్తున్నారన్నమాట. కోవింద్ కమిటీ గురించి ప్రహ్లాద్ చెప్పడమే గాని ఇంతవరకూ అధికారిక ప్రకటన వెలువరించలేదు. పైగా రాజ్యాంగం గురించిన చర్చను అనధికార కమిటీ ఎలా చేస్తుంది? ఆ అధికారం పార్లమెంటుకు మాత్రమే వుంది. గతంలో వాజ్‌పేయి హయాంలోనూ రాజ్యాంగ సంస్కరణలకై జస్టిస్ వెంకటాచలయ్య కమిటీని ఇలాగే ఏర్పాటు చేసి తర్వాత...సూచనల కోసం అని వెనక్కు తగ్గారు. ఇప్పుడైనా ఏకపక్షంగా రాజ్యాంగ కమిటీని ఏర్పాటు చేయడం చెల్లదు. ఆ అంశాన్ని తెరపైకి తేవడం, ప్రజల్లో అనుకూలత పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు కనిపిస్తుంది. పార్టీలు, వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాలతో ఈ కమిటీ సంప్రదిస్తుందంటున్నారు. కానీ ఇతర పార్టీలు, ప్రభుత్వాలు ఒక అనధికార కమిటీకి సహకరిస్తాయని చెప్పడం కష్టం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయినా పదవీ విరమణ తర్వాత మామూలు పౌరుడేనని ఇటీవల జస్టిస్ డి.వై. చంద్రచూడ్ స్పష్టంగా చెప్పారు. అధికార లాంఛనాలు కొన్ని వుండవచ్చు గాని మాజీ రాష్ట్రపతి అయినా ప్రత్యేక రాజ్యాంగ ప్రతిపత్తి ఏమీ వుండదు. ఈ కమిటీ సిఫార్సులు చేసినా వాటిని కేంద్ర క్యాబినెట్ తీర్మానం ముందుకు తెస్తారన్నమాట. ఎన్నికల సంఘం కూడా కేంద్రం ఒత్తిడితో గతంలోనే దీనిపై స్పందించింది. ఒకేసారి ఎన్నికలు జరపగల సత్తావుందని, కాకపోతే అదనంగా సహాయం అవసరమని వెల్లడించింది. తన వంతుగా అయిదు సూచనలు చేసింది. 1.కొత్త లోక్‌సభ ప్రారంభానికి తేదీ నిర్ణయించాలి. 2.అవిశ్వాస తీర్మానం తెచ్చేవారు ప్రత్యామ్నాయ ప్రభుత్వానికి నాయకత్వం వహించే వ్యక్తి పేరు అందులో సూచించాలి. 3. పదవీ కాలం కొద్దిగానే మిగిలి వుండగా ప్రభుత్వం పడిపోతే రాష్ట్రపతి పాలన పెట్టాలి. ఎక్కువ వుంటేనే ఎన్నికలు. 4. శాసనసభల విషయంలోనూ ఇదే జరగాలి. 5, లేదంటే అన్ని ఎన్నికలకూ నిర్ణీత తేదీలలో జరిగేలా నిర్ణయించాలి.

రాజ్యాంగానికే ఎసరు, దేశానికే ప్రమాదం

భారత రాజ్యాంగం ఏకకాల ఎన్నికలు జరగాలని చెప్పడం లేదు. లోక్‌సభ, శాసనసభల నియమ నిబంధనలు కాలపరిమితి అన్నీ వేర్వేరుగా వున్నాయి. మొదటి మూడు ఎన్నికలు కలిసే జరిగాయంటే కాంగ్రెస్ గుత్తాధిపత్యమే కారణం, 1967 నుంచి క్రమంగా ఈ పరిస్థితి మారుతూ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టడం, రద్దు చేయడం, పడిపోవడం చాలా చూశాం. కేంద్రంలోనూ కనీసం మూడు సార్లు ప్రభుత్వాలు ముందే పడిపోయాయి. వాటిపై ఏవో కొత్త షరతులు రుద్దాలనేది ఇక్కడ ఆంతర్యం. అంటే పదవీ కాలం ముగిసినా కొనసాగించడం లేక ఇంకా వున్నా ఎన్నికలకు వెళ్లకుండా పరోక్ష పాలన సాగించడం వంటివి రాజ్యాంగ నిర్దేశానికి విరుద్ధం. అప్పుడు ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం అనే మౌలిక సూత్రమే మంటగలిసి పోతుంది. ఎమర్జన్సీలో రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని ఆరేళ్లకు పెంచితే తర్వాత కత్తిరించాల్సి వచ్చింది. వాస్తవానికి శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి చోట్ల కూడా గతంలో నిరంకుశ ప్రభుత్వాలు పాలనా వ్యవస్థను ఇష్టానుసారం మార్చినా తర్వాత అవి నిలబడలేదు. వి.పి.సింగ్ ప్రభుత్వ కూల్చివేత తర్వాత అప్పటి రాష్ట్రపతి వెంకట్రామన్ జాతీయ ప్రభుత్వం అంటూ ఒక ప్రహసనం నడిపించి వెనక్కు తగ్గాల్సి వచ్చింది. బిజెపి ఎప్పుడూ అధ్యక్ష తరహా పాలన కోరుకుంటుంది. దేశంలో రాజకీయ సామాజిక బహుళత్వం కారణంగా అది చేయలేకపోయింది. మోడీ హయాంలో దాదాపు ప్రధాని కేంద్రంగా చేయడం అధ్యక్ష తరహా ప్రతిబింబమే. నోట్ల రద్దుతో సహా కీలక నిర్ణయాలు మోడీ ఒక్కరే తీసుకున్నారు. ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ సవరణ చట్టం వంటి వాటిని కూడా ఎవరితో చర్చించలేదు. ఈ నిర్ణయాలు సుప్రీం కోర్టు సమీక్షలో వుండటమే గాక తీవ్ర ప్రశ్నలకు కారణమవుతున్నాయి. లోక్‌సభ పదవీ కాలానికి సంబంధించిన 83వ అధికరణం రద్దుకు సంబంధించిన 85 అధికరణం, అసెంబ్లీల పదవీ కాలానికి సంబంధించిన 172 రద్దు పైన 174, రాష్ట్రపతి పాలనపై 356 అయిదు రాజ్యాంగ సవరణలు చేయవలసి వుంటుంది. శాశ్వత మార్పులైతే సగం శాసనసభల ఆమోదం కూడా అవసరమవుతుంది. లక్షల కోట్లు బడాబాబుల పరం చేయడమే గాక రాయితీల రూపంలో మరిన్ని లక్షల కోట్లు కట్టబెడుతున్న ఈ సర్కారు ఎన్నికల ఖర్చు తగ్గించాలని పొదుపు కబుర్లు చెప్పడం హాస్యాస్పదం. ఇది వాస్తవానికి అధికార దాహం, అప్రజాస్వామిక రాజ్యాంగ కుట్ర. మోహన్ భగవత్, మోడీల మాటల వెనక వున్న రాజకీయ దురుద్దేశాలు, మతతత్వ వ్యూహాల పట్ల ప్రజల అప్రమత్తత చాలా అవసరం. దురదృష్టమేమంటే తెలుగు రాష్ట్రాలలో రెండు పాలక పార్టీలైన వైసిపి, బిఆర్‌ఎస్, ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం ఏవీ ఈ పోరాటంలో పాలుపంచుకోవడం లేదు, బిజెపికి వత్తాసుగా నిలవడానికే పోటీ పడుతున్నాయి. 'ఇండియా' ఈ నిరంకుశత్వాన్ని నిలవరించేందుకు పోరాడటమే గాక ఎన్నికలలోనూ బిజెపి కూటమిని ఓడించడం ద్వారా ఆ కుటిల ప్రయత్నాలు శాశ్వతంగా అడ్డుకోవడం మరింత ముఖ్యం.

బిజెపి మత రాజకీయాలనూ కేంద్రం నిరంకుశత్వాన్ని ఓడించడానికి మరింత సమిష్టిగానూ సమర్థంగానూ సత్వర వ్యూహాలు రూపొందించుకోవాలని ప్రతిపక్షాల నాయకులు గుర్తించారు. కీలక నేతలందరూ హాజరైనారు కూడా. దేశంలోని 450 నియోజక వర్గాలలో బిజెపికి వ్యతిరేకంగా ఒకే అభ్యర్థిని నిలబెట్టి ఓడించాలని అందుకే తొలి అంశంగా నిర్ణయించుకున్నారు. అయితే ఇది విశాల ప్రతిపక్ష వేదిక మాత్రమే గనక వీలైనంతవరకూ కలసి పోటీ చేస్తామని ప్రకటించాయి. అందుకే జాతీయ స్థాయి సమావేశంలో గాక రాష్ట్రాల స్థాయిలోనే సమన్వయ కమిటీల ద్వారా ఎవరు ఎలా పోటీ చేయాలన్నది ఖరారు చేయాలని నిర్ణయించారు. ఆ నిర్ణయం వాస్తవికతను ప్రతిబింబిస్తుంది.

కోవింద్ కమిటీ గురించి ప్రహ్లాద్ చెప్పడమే గాని ఇంతవరకూ అధికారిక ప్రకటన వెలువరించలేదు. పైగా రాజ్యాంగం గురించిన చర్చను అనధికార కమిటీ ఎలా చేస్తుంది? ఆ అధికారం పార్లమెంటుకు మాత్రమే వుంది. గతంలో వాజ్‌పేయి హయాంలోనూ రాజ్యాంగ సంస్కరణలకై జస్టిస్ వెంకటాచలయ్య కమిటీని ఇలాగే ఏర్పాటు చేసి తర్వాత... సూచనల కోసం అని వెనక్కు తగ్గారు. ఇప్పుడైనా ఏకపక్షంగా రాజ్యాంగ కమిటీని ఏర్పాటు చేయడం చెల్లదు.

తిరుమల కేంద్రంగా విష ప్రచారం

వ్యాఖ్య



కందారపు మురళి

తిరుమల కొండపై బిజెపి ఉద్దేశపూర్వకంగా ఎంతో కాలంగా విషం చిమ్ముతున్నది. అవకాశం వచ్చినప్పుడల్లా అసత్యాలు జోడించి భక్తులను, సాధారణ ప్రజలను రెచ్చగొట్టడానికి పూనుకుంటున్నది.

తాజాగా టిటిడి బోర్డును కేంద్రంగా చేసుకుని బిజెపి నేతలు, మతోన్మాద శక్తులు విమర్శలు గుప్పిస్తున్నాయి. టిటిడి బోర్డుకు 52వ ఛైర్మన్‌గా నియమితులైన కరుణాకర్ రెడ్డిని క్రిస్టియన్‌గా, నాస్తికునిగా, అన్యమత ప్రచారకునిగా పలు ప్రకటనలు చేస్తున్నారు. గతంలో వై.వి.సుబ్బారెడ్డి పైనా ఇలాంటి విమర్శలే చేశారు. టిడిపి నియమించిన పుట్టా సుధాకర్, అనితలపైనా ఇలాంటి విమర్శలే చేశారు. పదిహేడేళ్ల కిందట నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి టిటిడి ఛైర్మన్‌గా కరుణాకర్ రెడ్డిని నియమించినప్పుడు బిజెపి వారు ఇదే రకమైన విమర్శలు చేశారు. ఆనాడు సోషల్ మీడియా ప్రభావం తక్కువ. విహెచ్‌పి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ఓ వెబ్‌సైట్‌ను సృష్టించి తప్పుడు కథనాలను ప్రచారం చేశాయి. తిరుమల నడక దారిలో శిలువకు పూజలు చేస్తున్నారని, తిరుమల కొండపై చర్చి నిర్మాణం జరుగుతున్నదని, ఏడు కొండలను రెండు కొండలుగా మార్చేశారని వంటి కథనాలు వండి వార్చారు. ఈ వెబ్‌సైట్ వివరాలను, వాటి కథనాలను నాటి టిటిడి ఉన్నతాధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి పలు మార్లు అందించినా కనీస చర్యలు చేపట్టడానికి సాహసించలేకపోయారు. ఇంతటితో ఆగకుండా విహెచ్‌పికి మద్దతుగా ఉన్న ఓ టీవీ ఛానల్ వారు తిరుమల బాలాజీనగర్‌లో ఓ ఇంటి గోడపై శిలువ గుర్తు వేస్తూ దొరికిపోయారు. సిబిసిఐడి వారు చేపట్టిన ఆ కేసు తదనంతర కాలంలో ఏమైందో ఏలికలకే ఎరుక.

సందర్భం వచ్చినప్పుడల్లా ఏదో ఒక వంక పెట్టుకుని తిరుమల కేంద్రంగా మతోన్మాద విషాన్ని చిమ్మేందుకు బిజెపి తమ సంస్థల ద్వారా ప్రయత్నిస్తూనే ఉంది.

టిటిడి బోర్డులో సభ్యులుగా కళంకితులకు స్థానం కల్పించారని వారిని తొలగించాలని బిజెపి యాగీ చేస్తున్నది. కేతన్ దేశాయికి రెండవసారి టిటిడి బోర్డులో అవకాశం కల్పించారు. గుజరాత్‌కు చెందిన ఈయనకు మహారాష్ట్ర నుంచి అవకాశం ఇచ్చారు. నరేంద్ర మోడీ, అమిత్ షా లకు సన్నిహితుడుగా చెప్పబడుతున్న ఈయన 'మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' ఛైర్మన్ హోదాలో ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని 8 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. ఇంకా 2 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈయనలో ఏ భక్తికి పరవశించి బిజెపి పాలకులు ఈయన సభ్యత్వానికి సిఫార్సు చేశారో చెప్పటం లేదు.

అరబిందో ఫార్మా గ్రూపు డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బిజెపి ఒత్తిడికి లొంగిపోయి అప్రూవర్‌గా మారారని, వైసిపి వంత పాడిందని మీడియాలో కథనాలు వచ్చాయి. కళంకిత బోర్డుగా మాట్లాడుతున్న బిజెపి ఓ విషయాన్ని మరుగు పరుస్తున్నది. ప్రకటించబడిన టిటిడి బోర్డులో బిజెపి సిఫార్సులతో సభ్యత్వం పొందిన వారు 10 మందికి దాకా ఉన్నారు. వైసిపికి ఈ విషయమై నోరు ఎందుకు పెగలటం లేదో అర్థం కాదు. పెద్దనోట్ల రద్దు సందర్భంగా నోట్ల కట్టలతో పట్టుబడ్డ శేఖర్ రెడ్డి టిడిపి హయాంలో బోర్డు సభ్యుడిగా ఉండటాన్ని నిరసిస్తూ వైసిపి విమర్శలు చేసింది. వైసిపి అధికారంలోకి వచ్చాక అదే శేఖర్ రెడ్డికి రెడ్ కార్పెట్ పరిచి మరీ బోర్డు సభ్యత్వం ఇచ్చారు. ప్రస్తుతం ఈయన టిటిడి చెన్నై సలహా మండలి ఛైర్మన్‌గా ఉన్నారు.

ఒకవైపు బిజెపి, విహెచ్‌పి, ఆర్‌ఎస్‌ఎస్‌లు టిటిడిపై దాడి చేస్తుంటాయి. మరో వైపు టిటిడికి మద్దతుగా శ్రీవాణి ట్రస్టులో అక్రమాలు జరగలేదంటూ విహెచ్‌పి, ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నేతలు టిటిడి వేదికల నుంచే మీడియా సమావేశాలు నిర్వహిస్తుంటారు. వాస్తవంగా శ్రీవాణి ట్రస్టు నుంచి చేస్తున్న ఖర్చులో సింహ భాగం బిజెపి అనుయాయ సంస్థల ద్వారా నిర్వహించ బడుతున్నది. టిటిడి లోని దాదాపు అన్ని ట్రస్టులను నిర్వీర్యం చేసి శ్రీవాణి ట్రస్టుకు మాత్రమే విరాళాలు తీసుకునేంత వరకు ఇది దారి తీసింది.

ఇక టిడిపి విషయానికి వస్తే 2014 తరువాత బిజెపి నేత భానుప్రకాష్ రెడ్డి బోర్డు సభ్యునిగా పని చేశారు. బిజెపి-టిడిపిల మధ్య ప్రత్యేక హోదా విషయమై టగ్ ఆఫ్ వార్ నడుస్తున్న కాలంలో మహారాష్ట్రకు చెందిన బిజెపి మంత్రి భార్యకు టిటిడి బోర్డు సభ్యత్వాన్ని కట్టబెట్టింది.

గత బోర్డులలో అధికారంలో ఉన్నది ఎవరైనా బిజెపి అనుయాయులకు టిటిడి బోర్డు సభ్యత్వం వుంది. ప్రస్తుత బోర్డులో కర్ణాటక లోని ఎలహంక బిజెపి ఎంఎల్‌ఎ ఎస్‌ఆర్ విశ్వనాథ్‌కు రెండవసారి సభ్యత్వం ఇచ్చారు. ఈయన నియోజక వర్గ పరిధిలోనే బెంగళూరులో జగన్మోహన్ రెడ్డి నివాసం ఉంది.

టిటిడి కేంద్రంగా మతోన్మాద చిచ్చును పదే, పదే రగిలించడానికి బిజెపి తిరుమల వెంకన్నను ఆధారం చేసుకున్నది. టిటిడి నిధులను ప్రజోపయోగానికి వినియోగించకూడదంటూ అడ్డు తగులుతున్నది.

తిరుపతి భూగర్భ డ్రైనేజి పనుల ఖర్చును టిటిడి భరించరాదని విహెచ్‌పి గతంలో కోర్టుకెళ్లింది. రూ.25 కోట్ల ఖర్చుతో పూర్తి కావలసిన పనులు, కేసు పూర్తయి టిటిడికి అనుకూలంగా తీర్పు రావడంతో ఖర్చు భారం రూ.100 కోట్లకు చేరింది.

తిరుపతి రుయా ఆసుపత్రి, స్విమ్స్ ఆసుపత్రులకు నిధులు కేటాయించడాన్ని, ఆఖరుకు స్విమ్స్ ఆసుపత్రికి ఇతర మతస్థులైన డాక్టర్లు రావడానికి వీల్లేదని బిజెపి దాని అనుయాయ సంస్థలు అడ్డుపడ్డాయి.

తిరుపతి నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గరుడ వారధి పేరుతో ఫ్లైఓవర్ (బ్రిడ్జి) నిర్మాణం చేపడితే ఈ నిర్మాణానికి టిటిడి నిధులు కేటాయించరాదని బిజెపి నేతలు కోర్టుకు వెళ్లారు. తిరుపతి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఉపసంహరించుకున్నారు.


టిటిడి నిర్వహిస్తున్న విద్య, వైద్యా సంస్థలు నిధుల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కాంట్రాక్టు అధ్యాపకులతో కాలం వెళ్లబుచ్చే పరిస్థితికి తెచ్చారు. టిటిడి విద్యాలయాలకు వేల సంఖ్యలో అడ్మిషన్లు వస్తున్నాయి. విద్యారంగాన్ని విస్తరింప చేయాల్సిన టిటిడి పట్టించుకోవడం లేదు.

తిరుమల కొండపై చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఎస్.వి హైస్కూలును రేమాండ్స్ వారికి అప్పచెప్పారు. తాజాగా తిరుపతిలోని మరికొన్ని టిటిడి విద్యా సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పాలన్న ప్రయత్నంలో ఉన్నారు.

టిటిడి అనేక ఏళ్లుగా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని విద్య, వైద్య రంగాలకు ఊతం ఇస్తున్న విధానాలకు తిలోదకాలిస్తున్నది. టిటిడి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కారణాలతో మతోన్మాద శక్తులకు బలం చేకూర్చే చర్యలకు పాల్పడుతున్నారు. తాము భస్మాసుర హస్తాన్ని నెత్తిన పెట్టుకుని తిరుగుతున్నామన్న వాస్తవాన్ని విస్మరిస్తున్నారు.

(వ్యాసకర్త సెల్: 94900 98840)

టిటిడి కేంద్రంగా మతోన్మాద చిచ్చును పదే, పదే రగిలించడానికి బిజెపి తిరుమల వెంకన్నను ఆధారం చేసుకున్నది. టిటిడి నిధులను ప్రజోపయోగానికి వినియోగించకూడదంటూ అడ్డుతగులుతున్నది. టిటిడి నిర్వహిస్తున్న విద్య, వైద్యా సంస్థలు నిధుల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కాంట్రాక్టు అధ్యాపకులతో కాలం వెళ్లబుచ్చే పరిస్థితికి తెచ్చారు. టిటిడి విద్యాలయాలకు వేల సంఖ్యలో అడ్మిషన్లు వస్తున్నాయి. విద్యారంగాన్ని విస్తరింప చేయాల్సిన టిటిడి పట్టించుకోవడం లేదు. తిరుమల కొండపై చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఎస్.వి హైస్కూలును రేమాండ్స్ వారికి అప్పచెప్పారు. తాజాగా తిరుపతిలోని మరికొన్ని టిటిడి విద్యా సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పాలన్న ప్రయత్నంలో ఉన్నారు.



కవిత్వం

ఎన్నికల 'ఎర'!

ఎన్నికలకు ముందుగా
ఏలికలకు గుర్తుకొస్తారు (యి)..!
ప్రియమైన దేశ ప్రజలు
పెను భారమైన అధిక ధరలు....!

అయిదేళ్ళ పాటు
అధికార మత్తులో జోగుతూ
నిత్యావసర వస్తువుల ధరలను
అను నిత్యం పెంచుతూనే వుంటారు..!
ఎలక్షన్ గంట కొట్టగానే..
మైకం లోంచి ఉలిక్కిపడి లేస్తారు...!

కోట్ల ప్రజల నాడిని
పాలకులపై వున్న వ్యతిరేకత వేడిని
సర్వేలతో నేతలు పసిగడతారు.
యుద్ధ ప్రాతిపదికన క్షేత్ర స్థాయిలో
దిద్దుబాటు చర్యలు చేపడతారు..!

అధిక ధరలు పేద, మధ్య తరగతి వర్గాలకు
గుదిబండగా మారాయని ఎట్టకేలకు
రాజకీయ మేధావులు గుర్తిస్తారు..!

మండుతున్న గ్యాస్ బండ మంటను కాస్త తగ్గించి
మహిళలపై మమకారమున్నట్లు
సానుభూతి రాయితీలు ఇస్తారు ..!
తాజా ఎన్నికల్లో పాలక వర్గాలు
విస్తృత ప్రచారాన్ని చేసుకుంటారు...!
గృహిణులకు ఎన్నికల ఎరగా వేస్తారు..!

కాస్త భారం తగ్గించారని
ఓటర్లు కించిత్ తలపోశారా..
నేతలు గెలిచిన తర్వాత
అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగాయని
మళ్ళీ గ్యాస్ ధరలు, ఇతర వస్తువుల ధరలు
ఇబ్బడి ముబ్బడిగా పెంచేస్తారు..!
నమ్మిన ప్రజలను రాజకీయ నాయకులు
అలవాటు ప్రకారంగా వంచిస్తారు..!

ప్రజలారా...మేలుకోండి..!
మీ ఓట్లను భారం దించే వాడికే
నిర్భయంగా నిశ్చయంగా వేయండి..!

- జి. సూర్యనారాయణ,
దివిసీమ.

జమిలి కమిటీలో 8 మంది సభ్యులు

- న్యాయశాఖ నోటిఫికేషన్

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికల కమిటీపై న్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. 8 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఛైర్మన్‌గా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను నియమించింది. కేంద్ర మంత్రి అమిత్‌షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి, గులాం నబీ ఆజాద్, 15వ ఆర్థిక సంఘం మాజీ ఛైర్మన్ ఎన్‌కె సింగ్, లోక్‌సభ మాజీ సెక్రెటరీ జనరల్ సుభాష్ కశ్యప్, సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారీలను కమిటీలో సభ్యులుగా చేర్చింది. మోడీ ప్రభుత్వం తొలి నుంచి ప్రచారం చేసుకుంటున్న 'ఒకే దేశం - ఒకే ఎన్నిక'పై తాజాగా కమిటీని నియమించడంతో దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికల అంశం చర్చనీయాంశమవుతోంది.

8 వారాల గడువు కావాలి

- వారణాసి కోర్టుకు పురావస్తు శాఖ నివేదిక

న్యూఢిల్లీ : జ్ఞానవాపి మసీదు సర్వేకు మరో ఎనిమిది వారాల గడువు ఇవ్వాలని పురావస్తు శాఖ వారణాసి కోర్టును కోరింది. గతంలో సర్వే పూర్తి చేసేందుకు నాలుగు వారాల సమయం ఇచ్చి సెప్టెంబర్ 2న నివేదిక సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఈ స్థితిలో పురావస్తు శాఖ మరో ఎనిమిది వారాల గడువు కోరింది. ఈ కేసును ఈ నెల ఎనిమిదో తేదీన కోర్టు విచారించనుంది. చర్చిలో చెత్తాచెదారం, వదులుగా ఉన్న మట్టి, నిర్మాణ వస్తువులు ఎక్కువగా ఉన్నందున సర్వే పూర్తి కావడానికి సమయం పడుతోందని పురావస్తు శాఖ పేర్కొంది.

అక్కాచెల్లెళ్లపై సామూహిక అత్యాచారం..

- బిజెపి నేత కుమారుడు సహా 10 మంది అరెస్ట్

డెహ్రాడూన్ : ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. ఇద్దరు అక్కాచెల్లెళ్లు రక్షాబంధన్ జరుపుకుని తిరిగి వస్తుండగా సామూహిక అత్యాచారానికి గురయ్యారు. ఓ బాధితురాలి కాబోయే భర్తను తీవ్రంగా కొట్టి ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ ఘోరానికి పాల్పడిన పదిమంది దుండగుల్లో ఇటీవల బెయిల్‌పై విడుదలైన స్థానిక బిజెపి నాయకుడు కుమారుడు ఉండటం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కా చెల్లెళ్లు, యువతికి కాబోయే భర్త ముగ్గురు కలిసి తిరిగి వస్తుండగా వారిని నిందితులలో ముగ్గురు మొదట అడ్డగించారు. ఆ ముగ్గురూ నగదు, మొబైల్ ఫోన్లు దోచుకెళ్లారు. మిగిలిన ఏడుగురు నిందితులు నాలుగు ద్విచక్ర వాహనాలపై సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈలోగా నిందితులు ఇద్దరు అక్కాచెల్లెళ్లను ప్రధాన రహదారికి దూరంగా నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. ఇద్దరు బాలికలతోపాటు వచ్చిన యువకుడిని కూడా తీవ్రంగా కొట్టారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడైన స్థానిక బిజెపి నాయకుడు లక్ష్మీ నారాయణ్ సింగ్ కుమారుడు పూనమ్ ఠాకూర్ సహా పది మందిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులలో నేర కార్యకలాపాల చరిత్ర కలిగిన వ్యక్తులు ఉన్నారు. పూనమ్ ఠాకూర్ గత నెలలోనే బెయిల్‌పై విడుదలయ్యాడు.

గెహ్లాత్‌కు రాజస్థాన్ హైకోర్టు నోటీసులు


జైపూర్ : న్యాయవ్యవస్థపై వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించి మూడు వారాల్లో వివరణ ఇవ్వాలని రాజస్థాన్ సిఎం అశోక్ గెహ్లాత్‌ను హైకోర్టు ఆదేశించింది. ఇటీవల ఆయన జైపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో అవినీతి పెచ్చరిల్లిపోయిందని అన్నారు. దీనిపై విమర్శలు రావడంతో న్యాయవ్యవస్థను ఎప్పుడూ గౌరవిస్తానని, నమ్ముతానని అన్నారు. ఈ వ్యాఖ్యలపై సుమోటోగా క్రిమినల్ ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ న్యాయవాది హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారు. దీనిపై జస్టిస్ శ్రీవాస్తవ, జస్టిస్ అశు తోష్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం శనివారం విచారణ చేపట్టి, సిఎంకు నోటీసులు జారీ చేసింది.

పాకిస్తాన్‌లో 8 మంది ఉగ్రవాదులు హతం

బలోచిస్తాన్ : గత 24 గంటల్లో బలూచిస్తాన్‌లో వేర్వేరు ఆపరేషన్లలో పాకిస్తాన్ ఉగ్రవాద నిరోధక విభాగం (సిటిడి) ఎనిమిది మంది ఉగ్రవాదుల్ని హతమార్చింది. పాకిస్తాన్‌కు చెందిన ఎఆర్‌వై న్యూస్ అనే మీడియా సంస్థ అందించిన సమాచారం మేరకు వాషక్ జిల్లాలోని బసిమా పట్టణంలోని తహసీల్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఓ ఇంటిపై భద్రతా బలగాలు శుక్రవారం దాడి చేశాయి. ఈ ఆపరేషన్‌లో ఐదుగురు ఉగ్రవాదులు మరణించగా, మరో ముగ్గురు తప్పించుకున్నారు. ఈ ఆపరేషన్‌లో పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని సిటిడి స్వాధీనం చేసుకుందని ఎఆర్‌వై న్యూస్ సంస్థ తెలిపింది. క్వెట్టాలో శుక్రవారం జరిగిన మరో ఆపరేషన్‌లో ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు. ఒక బిడ్డను ముగ్గురు ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారని అందిన సమాచారం మేరకు భద్రతా బలగాలు స్థావరానికి చేరుకుని.. చిన్నారిని సురక్షితంగా కాపాడారని, ఈ ఆపరేషన్‌లో ఆ ముగ్గురి ఉగ్రవాదుల్ని చంపినట్లు సిటిడి ప్రతినిధి మీడియాకు తెలిపారు. వారి రహస్య స్థావరం నుంచి ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా గాంధీజయంతి

- ఇండియా నిర్ణయం
- వెల్లడించిన నితీష్‌కుమార్



పాట్నా : అక్టోబర్ రెండున గాంధీజయంతిని దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని నిర్వహించినట్లు బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ తెలిపారు. రెండు రోజుల పాటు ముంబాయిలో జరిగిన ప్రతిపక్షాల ఐక్య ఫోరమ్ ఇండియా సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ముంబాయి నుండి శనివారం పాట్నాకు వచ్చిన ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్ణయించాలని ఇండియా నిర్ణయించినట్లు చెప్పారు. ప్రజాస్వామ్య, లౌకిక విలువలు ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాలు ఉంటాయని, ఎక్కడికక్కడ ప్రజానీకం వీటిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఇండియా ఫోరమ్‌ను చూసి బిజెపి భయపడుతోందని చెప్పారు. ఆ భయం కారణంగానే పార్లమెంటుతో పాటు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. ప్రతిపక్షాల ఐక్యత కూడా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎను కలవరపెడుతోందన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల చివరిలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, దాని ఎజెండా ఏమిటనేది ఇంకా వెల్లడించలేదన్నారు. జన గణన నిర్వహించడంలో జరుగుతున్న జాప్యం గురించి కేంద్ర ప్రభుత్వం మాట్లాడటం లేదన్నారు. "ఇప్పటివరకు జనాభా లెక్కల ప్రక్రియ మొదలు పెట్టలేదు. కానీ, నిబంధనల ప్రకారం, ఎప్పుడో ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి వుంది. మిగిలిన అన్ని విషయాలకు ఈ ప్రభుత్వానికి సమయం వుంటోంది కానీ కుల సర్వేకు, జన గణనకు మాత్రం సమయం వుండడం లేదు." అని నితీష్ వ్యాఖ్యానించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో జపగణనతో పాటు ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలను ప్రస్తావించనున్నట్లు చెప్పారు. సాధ్యమైనంతవరకు లోక్‌సభ ఎన్నికల్లో కలిసికట్టుగా పోటీ చేయాలని ఇండియా ఫోరమ్ నిర్ణయించిందని, త్వరలోనే సీట్ల సర్దుబాటు ప్రక్రియ ముగుస్తుందని అన్నారు.

జి 20ని హైజాక్ చేయాలనుకుంటున్నారు!

- రష్యా రాయబారి విమర్శ




న్యూఢిల్లీ : త్వరలో భారత్‌లో జరగబోయే జి 20 సదస్సును హైజాక్ చేయడానికి కొన్ని దేశాలు ప్రయత్నిస్తున్నాయని రష్యా విమర్శించింది. అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్యపరమైన అంశాలపై దృష్టి కేంద్రీకరించడానికి బదులుగా ఉక్రెయిన్ సంక్షోభానికి సంబంధించిన ఎజెండాను అమలు చేయడానికి కొన్ని దేశాలు రాబోయే జి 20 సదస్సును ఉపయోగించుకుంటాయని రష్యా భావిస్తోంది. వచ్చే వారం ఇక్కడ జరగనున్న సదస్సు నేపథ్యంలో న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రష్యా రాయబారి డెన్నిస్ అలిపొవ్ మాట్లాడుతూ, "దురదృష్టవశాత్తూ, జి 20కి అధ్యక్షురాలిగా వున్న భారత్ కొన్ని దేశాల నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. వారు జి 20 ఎజెండాను హైజాక్ చేస్తున్నారు. చర్చనీయాంశాల్లో ఉక్రెయిన్ సంక్షోభాన్ని చేర్చాలని చూస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. "జి 20 దేశాలు ఆర్థిక, ద్రవ్యపరమైన అంశాలపైనే దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది. కానీ గత ఏడాది నుండి, కొన్ని రాజకీయ అంశాలను కూడా చర్చించాలని ఈ గ్రూపులోని కొంతమంది సభ్యులు నిర్ణయించారు. అది మాకు ఆమోద యోగ్యం కాదు." అని అలీపోవ్ చెప్పారు. ఈ అంశాన్ని ఎజెండాలో భాగంగా చేర్చడంపై ఏకాభిప్రాయం రాని పక్షంలో దాన్ని తొలగించాలని అన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను చర్చించి, స్పందించేందుకు జి 20 ఏర్పాటైందని, భౌగోళిక, రాజకీయ సమస్యల కోసం కాదని చెప్పారు. మరే ఇతర సముచితమైన వేదికలపైనైనా ఉక్రెయిన్ యుద్ధం గురించి చర్చించడానికి మాస్కో సిద్ధంగా వుందన్నారు. జి 20కి అధ్యక్షురాలిగా భారత్‌కు గల ప్రాధాన్యతలకు రష్యా మద్దతిస్తుందన్నారు. వీటిలో సుస్థిర అభివృద్ధి, వాతావరణ మార్పులు, సర్వతోముఖాభివృద్ధి, డిజిటల్‌కు పరివర్తన వంటి అనేక అంశాలు వున్నాయన్నారు. భారత్ ఇప్పటికే ఏదైతే ఎజెండా పెట్టిందో దానిపైనే చర్చజరగగలదని ఆశిస్తున్నట్లు రష్యా పేర్కొంది. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ పాత్ర గురించి మాట్లాడుతూ, అతి త్వరలోనే నిర్ణయాత్మక కేంద్రాల్లో ఒకటిగా భారత్ మారుతుందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయంగా, సమానత్వం, న్యాయంతో కూడిన బహుళ ధృవ ప్రపంచానికి మద్దతునివ్వాలన్నదే తమ ప్రాధాన్యత అని అలీపోవ్ చెప్పారు.

8న మోడీతో బైడెన్ భేటీ

జి 20 సదస్సులో పాల్గొనేందుకు వచ్చే వారం భారత్ వస్తున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈ నెల 8వ తేదీన ప్రధాని మోడీతో భేటీ కానున్నారు. ఈ మేరకు వైట్‌హౌస్ ఒక ప్రకటన చేసింది. 9. 10 తేదీల్లో జి 20 సదస్సు జరుగుతుండగా, దానికి ఒక రోజు ముందుగా ఇరువురు నేతలు సమావేశం కానున్నారు. పరిశుద్ధ ఇంధనానికి పరివర్తన చెందడంతోపాటు వాతావరణ మార్పులపై పోరు సహా పలు అంతర్జాతీయ అంశాలపై ఉమ్మడిగా సాగించాల్సిన పోరాటంపై జి 20 దేశాలు చర్చిస్తాయి.ఎఎఎఎఎఎఎఎఎఎ

బిలియనీర్ల కోసమే బిజెపి : రాహుల్

రాయ్‌పూర్ : బిజెపి, నరేంద్ర మోడీ భారతదేశంలోని ఇద్దరు, ముగ్గురు బిలియనీర్ల కోసం పనిచేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరిగిన ర్యాలీలో, 'రాజీవ్ యువ మితాన్ క్లబ్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బిజెపి భారతదేశ ఆర్థిక వ్యవస్థ నడ్డివిరిచిందని అన్నారు. అదానీపై భారత ప్రధాని విచారణ జరపలేరని, ఎందుకంటే విచారణ తర్వాత నష్టం అదానీకి కాదని విమర్శించారు. మరోవైపు జిఎస్‌టి, పెద్దనోట్ల రద్దుతో చిన్న వ్యాపారాలు ధ్వంసమయ్యాయని, ఇవి ఉద్దేశపూర్వకంగా చేసినవేనని చెప్పారు. బిజెపి పని ప్రజలను విభజించడం, హింసను, విద్వేషాన్ని వ్యాప్తి చేయడమని రాహుల్ గాంధీ విమర్శించారు. మణిపూర్, అస్సాం, కర్ణాటకలో బిజెపి విద్వేషాన్ని వ్యాప్తి చేసిందని చెప్పారు. కాంగ్రెస్ చేసే పని ప్రజలను ఏకం చేయడమని అన్నారు. కర్ణాటకలో 230 నుంచి 250 సీట్లు గెలుచుకుంటామని బిజెపి చెప్పిందని, ఆ రాష్ట్రంలో ప్రతి పేద వ్యక్తి కాంగ్రెస్‌కు ఓటు వేశాడని అన్నారు.



స్లీప్ మోడ్‌లోకి విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ : ఇస్రో

బెంగళూరు: చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన అమెరికా, రష్యా, చైనాల తరువాత నాలుగో దేశంగా, చంద్రుడి దక్షిణ ధృవంపై ల్యాండర్‌ని దించిన తొలిదేశంగా భారత్ నిలిచింది. ఇప్పటికే విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్లు తమ పనిని ప్రారంభించాయి. చంద్రుడిపై సూర్యరశ్మి తగ్గిపోతుండటంతో రోవర్, ల్యాండర్లు రెండింటినీ స్లీప్ మోడ్ లోకి పంపేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తోంది. చంద్రుడి దక్షిణ ధవంపై 14 రోజుల వరకు మాత్రమే సూర్యుడి కాంతి పడుతుంది. మరో 14 రోజుల పాటు కఠిక చీకటి, మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్లు పూర్తిగా సూర్యకాంతిపై ఆధారపడే సోలార్ సెల్స్‌తో పనిచేస్తుంటాయి. ప్రస్తుతం దక్షిణధవంపై సూర్యకాంతి తగ్గుతుండటంతో రానున్న రోజుల్లో ల్యాండర్, రోవర్లను స్లీప్ మోడ్ లోకి పంపేందుకు ఇస్రో సమాయత్తం అవుతుంది. దీనిపై ఇస్రో చీఫ్ సోమనాథ్ కూడా ప్రకటన చేశారు.

వంద మీటర్ల ప్రయాణం పూర్తి చేసిన ప్రజ్ఞాన్ రోవర్

మరోవైపు రోవర్ ప్రజ్ఞాన్ చంద్రుడి నేలపై తిరుగుతోంది. అక్కడి నేలలోని మూలకాలను విశ్లేషిస్తోంది. చంద్రుడి ఉపరితలంపై ఆక్సిజన్, సల్ఫర్ తో పాటు ఐరన్, క్రోమియం, సిలికాన్ వంటి మూలకాలు ఉన్నట్లు చంద్రయాన్-3 ప్రయోగంతో తెలిసింది. రోవర్ 100 మీటర్ల ప్రయాణాన్ని పూర్తిచేసుకుంది. దీనిపై ఇస్రో ట్వీట్ కూడా చేసింది.

అమెరికాలో హైదరాబాద్ మహిళ ఆత్మహత్య

న్యూయార్క్ : అమెరికాలో ఉంటున్న ఓ హైదరాబాద్ మహిళ అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలానికి చెందిన ఏనుగు మల్లారెడ్డి, అనసూయ దంపతులు ఎల్బీనగర్‌లో కామినేని ఆస్పత్రి వెనుక ఉన్న సూర్యోదయ కాలనీలో ఉంటున్నారు. వారి కుమారుడు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో స్థిరపడ్డారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన ఆయనకు 18 ఏళ్ల క్రితం కవితతో వివాహమైంది. కాగా, కొంతకాలంగా అనారోగ్యంతో అవస్థలు పడుతున్న కవిత గురువారం ఉరివేసుకుని మరణించారు.

బలవంతంగా కుకీ కుటుంబాల తరలింపు

- సైన్యం దుందుడుకు చర్య



ఇంఫాల్‌లో తమ నివాసంలో కుకీ కుటుంబం (ఫైల్)

ఇంఫాల్ : ఇంఫాల్‌లో చిట్టచివరి కుకీ-జో కుటుంబాన్ని కూడా భద్రతా బలగాలు శనివారం తెల్లవారు జామున బలవంతంగా తరలించాయి. మే 3న మణిపూర్‌లో జాతుల ఘర్షణ, హింసాకాండ చెలరేగినా వీరందరూ అక్కడే వున్నారు. వారిని ప్రస్తుతం బలవంతంగా అక్కడ నుండి వేరే ప్రాంతానికి తరలించారు. ఇంఫాల్ ఈస్ట్‌లోని న్యూ లాంబులేన్ నుండి సేనాపతి జిల్లాలోని మాట్‌బంగ్‌కు తరలించేందుకు సురక్షితమైన దారిని ఏర్పాటు చేసినట్లు భద్రతా బలగాలకు చెందిన వర్గాలు తెలిపాయి. పౌర యంత్రాంగం చేసిన అభ్యర్ధన మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చాలా కాలం నుండి గిరిజనులు అక్కడ వుంటున్నారని, కానీ వారు దాడులకు లక్ష్యాలుగా మారారని ఆ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర రాజధానిలోని నట్టనడిబొడ్డున గల న్యూ లాంబులేన్ ఏరియాలో నివసిస్తున్న దాదాపు 300 గిరిజన కుకీ-జో కుటుంబాలు, హింస చెలరేగిన తర్వాత క్రమంగా అక్కడ నుండి వెళ్లిపోయాయి. 24మందితో కూడిన ఐదు కుటుంబాలు మాత్రం ఎక్కడకూ వెళ్లకుండా అక్కడే వుండిపోయాయి. ముఖ్యమంత్రి నివాసానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరం కూడా లేని ఈ ఏరియాను కేంద్ర భద్రతా బలగాలు, భారత సైన్యం 24గంటలూ కాపలా కాశాయి. ఆగస్టు 27న కొంతమంది దుండగులు కుకీ కుటుంబానికి చెందిన ఖాళీ ఇల్లును తగలబెట్టారు. ఆ మంటలు కొన్ని మెయితీ ఇళ్లకు కూడా పాకాయి. దాంతో స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. 1990 నుంచి నివసిస్తున్నందున తాను ఇంటిని ఖాళీ చేయలేదని ఎస్.ప్రిమ్ వైఫీ (78) చెప్పారు. మెయితీలకు తాము ఇక్కడ వుండడం ఇష్టం లేదని అన్నారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత భద్రతా బలగాలు తమ ఇంటికి వచ్చి తక్షణమే ఇల్లు ఖాళీ చేయాల్సిందిగా కోరాయని చెప్పారు. మరో జత దుస్తులు లేదా స్వెట్టర్ లేదా జాకెట్, చివరకు టూత్‌పేస్ట్ కూడా తెచ్చుకోలేకపోయామని వైఫీ ఆవేదన వ్యక్తం చేశారు. సైనిక వాహనంలో తమను 25 కిఓలోమీటర్ల దూరంలోని అస్సాం రైఫిల్స్ కేంప్ వద్దకు తీసుకువచ్చారని, అక్కడ రాత్రంతా టెంట్ కింద చల్లని నేలపై కూర్చుని గడిపామని చెప్పారు. ఇలా బలవంతంగా తమను కిడ్నాప్ చేసిన తరహాలో తరలించడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మణిపూర్ దర్బార్‌లో పనిచేసిన క్లర్కుల కుటుంబాల నాల్గవ తరానికి చెందినవారు వీరంతా. వందేళ్లకు పైగా వీరు ఇక్కడ సెటిలై పోయారు. లాంబూ అంటే క్లర్కు అని అర్ధం. లాంబులేన్ అంటే క్లర్కులు నివసించే ప్రాంతం.

మరాఠా కోటాపై మహారాష్ట్రలో ఆందోళనలు

- పోలీసుల చర్యతో హింసాత్మకం
- 360 మందిపై కేసులు
- రిజర్వేషన్ ఇచ్చేవరకు నిరాహార దీక్ష కొనసాగిస్తామంటున్న ఆందోళనకారులు



నినాదాలు చేస్తున్న ఆందోళనకారులు

ఔరంగాబాద్ : మరాఠా కోటాపై తలెత్తిన నిరసనలు హింసాత్మకంగా మారిన నేపథ్యంలో మహారాష్ట్రలోని జల్నాలో పరిస్థితి శనివారం అదుపులో వుంది. మొత్తంగా 360మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అందులో హింసకు పాల్పడినట్లుగా భావిస్తున్న 16మందిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఔరంగాబాద్‌కు 75కిలోమీటర్ల దూరంలో అంబడ్ తహసిల్‌లో అంతర్వాలి శరతి గ్రామంలో శుక్రవారం నాడు హింసకు పాల్పడిన అల్లరి మూకపై పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. లాఠీలతో వారిని చెదరగొట్టారు. ఆ ఆందోళనల్లో నిరసనకారులతోపాటు కొంతమంది పోలీసులు, ఇతరులు గాయపడ్డారు.

మరాఠా కమ్యూనిటీకి రిజర్వేషన్లు కావాలని డిమాండ్ చేస్తూ మనోజ్ జారంగె నేతృత్వంలో ఆందోళనకారులు మంగళవారం నుంచి నిరాహార దీక్ష చేస్తున్నారు. డాక్టర్ల సూచనపై జారంగెను ఆస్పత్రికి తరలించడానికి పోలీసులు ప్రయత్నించడంతో సమస్య మొదలైందని అధికారులు తెలిపారు. కొంతమంది వ్యక్తులు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సులు, ప్రైవేటు వాహనాలను లక్ష్యంగా చేసుకోవడంతో ఆందోళన హింసాత్మకంగా మారిందని పోలీసులు తెలిపారు. పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారని గ్రామస్తులు చెబుతున్నారు. కానీ అధికారులు దాన్ని ధృవీకరించలేదు. ప్రభుత్వం రిజర్వేషన్ కల్పించేవరకు ఆందోళన కొనసాగిస్తామని నిరసన కారులు తెలిపారు. ఆందోళనకు నేతృత్వం వహిస్తున్న మనోజ్ జారంగె విలేకర్లతో మాట్లాడుతూ, నిరాహార దీక్షను విరమించేది లేదని స్పష్టం చేశారు. మరాఠా రిజర్వేషన్‌పై ముఖ్యమంత్రి ఒక కమిటీని వేశారు. కానీ అది ఇంతవరకు నివేదిక అందచేయలేదని, అందువల్లే తాము ఆందోళన చేస్తున్నామని చెప్పారు. తన చేతిలో బుల్లెట్ గాయాన్ని చూపిస్తూ, అమానుషంగా పోలీసులు లాఠీచార్జికి దిగారని అన్నారు. మహిళలపై కూడా చేయి చేసుకున్నారన్నారు. 'మేమేమైనా పాకిస్తానీలమా లేక వారి బంధువులమా ? ఎందుకు కాల్పులు జరిపారు? మాకు రిజర్వేషన్లు ఇచ్చేవరకు మేం ఆందోళన ఆపేది లేదు. ఎన్ని కావాలో అన్ని బుల్లెట్లు ముఖ్యమంత్రిని కాల్చుకోమనండి' అని జారంగె పేర్కొన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తుండగా... గాల్లోకి కాల్పులు జరిపి, ఎందుకు లాఠీచార్జీ చేశారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. 40మంది వరకు తమ సిబ్బంది, మరికొందరు గాయపడ్డారని పోలీసులు చెప్పారు. 15 ఆర్‌టిసి బస్సులు, కొన్ని ప్రైవేటు వాహనాలను తగలబెట్టారని అన్నారు. 360మందిపై గోండి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రజలు శాంతియుతంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కోరారు. హింసపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ముగ్గురు రైల్వే అధికారులపై సిబిఐ ఛార్జిషీట్

- సాక్ష్యాలు నాశనం చేశారంటూ అభియోగాలు

భువనేశ్వర్: ఒడిశాలోని బాలాసోర్‌లో మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదంపై దర్యాప్తు చేసిన సిబిఐ, ముగ్గురు రైల్వే ఉద్యోగులపై చార్జిషీట్ దాఖలు చేసింది. సీనియర్ ఇంజినీర్ అరుణ్ కుమార్ మహంతా, సెక్షన్ ఇంజినీర్ మహమ్మద్ అమీర్ ఖాన్, టెక్నీషియన్ పప్పు కుమార్‌లపై హత్య, సాక్ష్యాలు ధ్వంసం వంటి నేరపూరిత అభియోగాలు మోపింది. ఈ ముగ్గురినీ జూలైలో సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఐపిసిలోని 304, 201 సెక్షన్ల కింద వారిపై కేసు నమోదు చేశారు. జూన్ 2న బాలాసోర్‌లో మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో సుమారు 290 మంది మరణించగా, వేలాది మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం వెనుక విద్రోహ చర్య ఉండవచ్చని రైల్వే శాఖ అనుమానించింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సిబిఐ దర్యాప్తు కోరారు. రంగంలోకి దిగిన సిబిఐ అధికారులు మానవ తప్పిదమే ప్రమాదానికి ప్రధాన కారణమని తేల్చారు. బహనాగ బజార్ స్టేషన్ సమీపంలోని లెవెల్ క్రాసింగ్ గేట్ నంబర్ 94 వద్ద మరమ్మతు పనులను ఎల్‌సి గేట్ నంబర్ 79 సర్క్యూట్ రేఖాచిత్రాన్ని ఉపయోగించి సీనియర్ ఇంజినీర్ మహంత చేసినట్లు సిబిఐ పేర్కొంది. సిగ్నల్స్ నిర్వహణ, ఇంటర్‌లాకింగ్ ఇన్‌స్టలేషన్‌లను పరీక్షించడం, సరిదిద్దడం, ఆమోదించిన ప్లాన్ ప్రకారం మార్పులు చేయడం వంటివి ఆయన విధులు కాగా, ఆ మేరకు ఆయన చేయలేదని ఆరోపించింది.

డిమాండ్లు పరిష్కరించకపోతే 27 నుంచి సమ్మె

- యుపిఎస్‌ఆర్‌టిసి సిబ్బంది హెచ్చరిక
- ప్రాంతీయ మేనేజర్ కార్యాలయం దిగ్బంధం

లక్నో : దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (యుపిఎస్‌ఆర్‌టిసి) కార్మికులు, బస్సు డ్రైవర్లు, కండక్టర్లు లక్నోలోని ప్రాంతీయ మేనేజర్ కార్యాలయాన్ని దిగ్బంధించారు. జిఎంకి 25పాయింట్లతో కూడిన మెమోరాండాన్ని అందజేశారు. తమ డిమాండ్లు నెరవేరని పక్షంలో 27నుండి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్ రోడ్‌వేస్ కర్మాచారి సంఘ్ ఆధ్వర్యంలో ఆందోళన జరుపుతున్న కార్మికులు ఆర్‌టిసి పాలనా యంత్రాంగం తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్మికుల శ్రమను ప్రభుత్వం దోపిడీ చేస్తోందని విమర్శించారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లను ఏడాది సర్వీసు పూర్తయిన వెంటనే రెగ్యులర్ చేయాలని, వారికి ఒకే వేతన స్కేలును వర్తింప చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జాతీయ రహదారిపై ప్రైవేటు వాహనాలు, అనధికార బస్సుల రాకపోకలను నిలిపివేయాలని కోరుతున్నారు. ఉద్యోగుల వేతనాలను 14శాతం పెంచాలని కోరుతున్నారు. వేతనాల్లో ఏకరూపతను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇవే డిమాండ్లతో రోడ్‌వేస్ కర్మాచారీ సంయుక్త పరిషద్ అనేక చోట్ల ఆందోళనలు నిర్వహించింది. యుపిఎస్‌ఆర్‌టిసిలో దాదాపు 34వేల మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరిలో 18వేల మంది కండక్టర్లు కాగా, మిగిలిన వారు డ్రైవర్లు. 9వేల మంది మాత్రమే శాశ్వత సిబ్బంది వున్నారని, వీరిలో మూడు వేల మంది కండక్టర్లు కాగా, ఆరువేల మంది డ్రైవర్లు అని యూనియన్ నేతలు చెప్పారు.

ఛత్తీస్‌గఢ్‌కు కాంగ్రెస్ ఏమీ చేయదు : అమిత్‌షా

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి ఢిల్లీకా దర్బార్ (గాంధీ కుటుంబం) ఏమీ మేలు చేయదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. ఈ ఏడాది చివరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోంది. అక్కడి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించేందుకు ఆరోప్ పాత్ర (అభియోగాల జాబితా)ను శనివారం రాయ్‌పూర్‌లో అమిత్‌షా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాబోయే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు కేవలం పాలన మార్పు గురించి మాత్రమే కాదు. ఛత్తీస్‌గఢ్ భవిష్యత్తు గురించి కూడా. రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్ అవినీతి ప్రభుత్వానికి ఓటు వేయాలా? లేక అభివృద్ధి ఆధారిత బిజెపి ప్రభుత్వానికి ఓటు వేయాలా? అనేది నిర్ణయించుకోవాలి. ఛత్తీస్‌గఢ్‌కి ఢిల్లీకా దర్బార్ (గాంధీ కుటుంబం) మేలు చేయదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, కుంభకోణాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'ఆరోప్ పత్ర'ను ఆవిష్కరించాం' అని అన్నారు.

ఓటుతో టిఎంసి దౌర్జన్యాలపై ప్రతీకారం

- సిపిఎం అభ్యర్థికి మద్దతుగా అధిర్ రంజన్ చౌదరి ప్రచారం

కోల్‌కతా : దౌర్జన్యానికి పాల్పడుతున్న టిఎంసిని, మతతత్వ బిజెపిని ఓడించడం ద్వారా ప్రతీకారం తీర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి ఓటర్లను కోరారు. దూప్‌గురి ఉప ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థి ఈశ్వర్ చంద్రరాయ్‌కు మద్దతుగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న ద్వంద్వ హింసతో బెంగాల్ ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, ప్రజలు తమ ప్రజాస్వామ్య హక్కులను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి మతతత్వ రాజకీయాలను, టిఎంసి బీభత్సకాండను ఓడించాలని, సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. టిఎంసి, బిజెపి తీవ్రమైన అవినీతికి పాల్పడ్డాయని ఆయన చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీం మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల్లో బారీ కుంభకోణానికి సంబంధించి టిఎంసి ప్రధాన కార్యదర్శిని ప్రశ్నించాలని హైకోర్టు ఆదేశించినా ఇడి, సిబిఐ ఆ పని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. 'ముంబై, బెంగళూరులో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు.. ధూప్‌గురిలో ఏం జరుగుతుందో ప్రజలకు తెలుసు.. ఇక్కడ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయి.. గిరిజనులను మమత తన కాళ్లతో పోలుస్తున్నారని' ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో టిఎంసి, బిజెపిలకు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నెల 5న ఉప ఎన్నిక జరగనుంది.

బిజెపి నుంచి కాంగ్రెస్‌లోకి..

- మధ్యప్రదేశ్‌లో మారుతున్న రాజకీయ సమీకరణలు

భోపాల్ : మధ్యప్రదేశ్ రాజకీయాలు వేడెక్కాయి. ఈ ఏడాది చివరిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో బిజెపి కొంతమంది సీనియర్ నేతలు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. తాజాగా బిజెపికి రాజీనామా చేసిన కొలారస్ ఎమ్మెల్యే వీరేంద్ర రఘువంశీ కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ సమక్షంలో వీరేంద్ర రఘువంశీ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కమల్‌నాథ్ మాట్లాడుతూ.. 'కేంద్రమంత్రి జ్యోతిరాధిత్య సింధియా వర్గానికి చెందిన వారే కాకుండా.. ఇతర బిజెపి నేతలు చాలామంది నాతో టచ్‌లో ఉన్నారు. సింధియాకు నమ్మిన బంటుగా ఉన్న సమందర్ పటేల్ కూడా గత నెల్లో స్థానిక కాంగ్రెస్ నాయకత్వం అనుమతితోనే పార్టీలోకి చేరారు.' అని ఆయన అన్నారు.


కాగా, రఘువంశీ బిజెపిని వీడిన మరుసటి రోజే శుక్రవారం రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గిరిజ శంకర్ బిజెపికి రాజీనామా చేయడం గమనార్హం. వింధ్య ప్రాంతానికి చెందిన ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేలు, మహాకౌశల్, బుందేల్‌ఖండ్ ప్రాంతాలకు చెందిన బిజెపి నేతలు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. గడచిన మూడు నెలల కాలంలో పలువురు బిజెపి నేతలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి చేరారు. వీరిలో మాజీ ముఖ్యమంత్రి కైలాష్ జోషి కుమారుడు మాజీ మంత్రి దీపక్ జోషి, మాజీ ఎమ్మెల్యే రాధేలాల్ బాఘేల్, మాజీ ఎమ్మెల్యే కున్వర్ ధ్రువ్ ప్రతాప్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే దేశరాజ్ సింగ్ కుమారుడు యద్వేంద్ర సింగ్, సమందర్ సింగ్ పటేల్ ఉన్నారు. వీరితోపాటు బిజెపి మాజీ ఎంపి మఖాన్‌సింగ్ సోలంకి బిజెపికి రాజీనామా చేసి ఏప్రిల్‌లో కాంగ్రెస్‌లో చేరారు.

నాలుగేళ్లలో రూ.4,200కోట్ల డ్రగ్స్ స్వాధీనం

- అసోం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్ పిసి నాయర్

డిస్పూర్: ఇండో-మయన్మార్ సరిహద్దుల్లో డ్రగ్స్ స్మగ్లింగ్ భారీగా జరుగుతున్నది. గత నాలుగేళ్లలో రూ.4,267 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను అసోం రైఫిల్స్ స్వాధీనం చేసుకున్నది. జాతీయ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అసోం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్ పిసి నాయర్ మాట్లాడుతూ.. సరిహద్దులను కాపాడడంతో పాటు డ్రగ్స్, అక్రమ ఆయుధాల రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగేళ్లలో రూ.4267 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. 2020లో రూ.875కోట్ల విలువైన అక్రమ రవాణా చేస్తున్న డ్రగ్స్‌ను పట్టుకున్నామన్నారు. 2021లో రూ.1402కోట్లు, 2022లో రూ.855కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మయన్మార్‌లో యుద్ధం నేపథ్యంలో రెండు సంవత్సరాల్లో తగ్గుదల నమోదైందని పేర్కొంది. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.1135 కోట్ల విలువైన అక్రమ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అసోం రైఫిల్స్ డైరెక్టర్ పేర్కొన్నారు. ఆధునిక ఆయుధాలను కొనుగోలు చేశామని తెలిపారు. వాటిలో థర్మల్ ఇమేజర్లు, నైట్ విజన్ పరికరాలు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, తేలికపాటి బుల్లెట్ ప్రూఫ్ హెల్మెట్లు, డ్రోన్లు, యాంటీ మైన్ వెహికల్స్ పలు అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయని పేర్కొన్నారు.







మీకోసం

వంటగదిలో వాడే కత్తెరలకు తరచూ వాజ్‌లైన్ రాస్తూ ఉంటే పదును పోకుండా చాలాకాలం మన్నుతాయి.

జీవన సౌరభం

ఆశతో ఉన్న వాడికి అధికారం ఇస్తే దోచుకుతింటాడు. ఆశయంతో ఉన్నవాడికి అధికారం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తాడు.

JEEVANA జీవన the family

గురువు

గురువే విజ్ఞానం
గురువే ఆనందం
గురువే మన మార్గం
గురువే మన జీవనం

గురువుతో అనుబంధం
ఆయువుతో సమానం
గురువే మన నేస్తం
గురుతు నేర్పిన ప్రాణం

గురువులోని సారం
శిష్యులకే సొంతం
గురువే మన శిల్పి
రగిలించే స్ఫూర్తి

గురువులోని గొప్పతనం
తెలుసుకుంటే ఆనందం
గురువే మన మూలధనం
నడిపించే ఇంధనం

గురువే గొప్పతరువు
సేద తీర్చు కడవరకు
చందమామ గురువు
వెలుగు లీను బతుకు

గురువంటే దైవం
గురువంటే నమ్మకం
గురువే మన జయం
గుర్తు పెట్టుకో ప్రతిక్షణం

చందనపు సౌరభం
గురువు నేర్పు పాఠం
గురువే మన ధ్యానం
క్రమశిక్షణ జీవితం


- మొర్రి గోపి,
8897882202.

సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ తికమకగా ఉన్న అక్షరాలను సరైన క్రమంలో రాస్తే అర్థవంతమైన పదాలు వస్తాయి. ట్రై చేయండి మరి..

1 విస్తరాలుకు - - - - -
2 తేటీనెగలు - - - - -
3 అడాలుప్వ - - - - -
4 సహంలవిదీ - - - - -
5 రురుమాతా - - - - -

నేను గీసిన బొమ్మ





బి. తిరుపతి,
10వ తరగతి,
జెడ్‌పిహెచ్ స్కూలు,
ముత్యాలపేట,
కవిటి మండలం,
శ్రీకాకుళం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆడిస్తూ, పాడిస్తూ బోధిస్తారు ...

'చీమను చూసి క్రమశిక్షణ... భూమిని చూసి ఓర్పు...చెట్టును చూసి ఎదుగుదల... ఉపాధ్యాయుడిని చూసి సుగుణాలు నేర్చుకో...' అని అంటారు పెద్దలు. ఇది అక్షరాల నిజం చేస్తున్నారు ఈ ఉపాధ్యాయులు. తరగతి గదిలో బోధన విద్యార్థి కేంద్రంగా జరగాలంటున్న ఈ ఉపాధ్యాయులు ఆచరణలో వివిధ నైపుణ్య పద్ధతులను అవలంబించటం ద్వారా ఉన్నతంగా ఎందరినో భావి భారత పౌరులను తీర్చిదిద్దుతున్నారు. ఆటపాటలతో చిన్నారులకు చదువు పట్ల ఆసక్తి కలిగించొచ్చునని ఉమాగాంధీ నిరూపించారు. విద్యార్థులను అక్కున చేర్చుకోవటం ద్వారా అదనపు సమయం కేటాయించటం ద్వారా చదువుతో వెనుకబడిన వారిని కూడా ముందువరుసలో నిలపొచ్చునని ఆచరణ ద్వారా రుజువు చేశారు మేకల భాస్కరరావు. ఆటపాటలతో సంతోషాత్మక బోధన ద్వారా అత్యంత సులభంగా చదువు చెప్పొచ్చునని ఆచరణలో నిజం చేస్తున్నారు శెట్టెం ఆంజనేయులు.. ఈ ముగ్గురూ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల ఐదోతేదీన ఢిల్లీలో జరిగే ప్రత్యేక వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకోనున్నారు. వీరి విద్యాబోధన ఏ విధంగా సాగుతుందో వారి మాటల ద్వారానే తెలుసుకుందాం.

పాఠాలే పాటలుగా ...



ఆటపాటలతో చిన్నారులకు చదువు పట్ల ఆసక్తి కలిగించి... వారిలో మనోవికాసానికి బాటలు వేయడం కూడా నా వృత్తిలో భాగం చేసుకున్నా. మా నాన్న రామకేశవరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేశారు. విశాఖ జిల్లా భీమిలి మాది. అమ్మ భువనేశ్వరి గృహిణి. ముగ్గురు సంతానంలో నేను పెద్దదాన్ని. తమ్ముళ్లు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులుగానే స్థిరపడ్డారు. నాన్న కూడా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ, వారితో మమేకమవుతూ పాఠాలు చెప్పేవారు. 1998 డీఎస్సీలో ప్రైమరీ స్కూల్ టీచర్‌గా విజయనగరం పట్టణ పరిధిలోని కొత్త మజ్జిపేట పాఠశాలలో చేరా. ఆ పాఠశాల అప్పుడే ప్రారంభం కావడంతో భవనం కూడా లేదు. పూరిపాకలోనే పాఠాలు చెప్పాల్సివచ్చింది. చుట్టుపక్కల పాములు, పురుగులు వంటివి వస్తే వాటితో పిల్లలు ఆడుతూ ఉండేవారు. పిల్లలను తరగతి గదిలోకి వచ్చి కూర్చోవాలని చెప్పినా పట్టించుకునేవారు కాదు. ఆ చిన్నారుల తల్లులు వచ్చి వారి బాధను చెప్పుకునేవారు. దాంతో ఎలాగైనా సరే... పిల్లలను తరగతి గదిలో కూర్చోబెట్టాలనుకున్నా. అందుకు నాన్న అనుసరించిన విధానాన్ని ఎంచుకున్నా. పిల్లలు చేసే అల్లరి, చిలిపి చేష్టలను పరిశీలిస్తూ, వాటినే పాటలుగా మార్చి వారి ముందు పాడేదాన్ని. వారు చేసిన పనులే పాట రూపంలో పాడడంతో వారిలో ఆసక్తి పెరిగి, తరగతి గదిలోకి వచ్చి కూర్చుని వినేవారు.



మురహరరావు ఉమాగాంధీ,
శివాజీపాలెం ప్రాథమిక పాఠశాల సెకండరీగ్రేడ్ టీచర్,
విశాఖపట్నం.

పిల్లల స్థాయికి వెళ్లి ...



విద్యార్థుల ఆసక్తులను గుర్తించి విద్యాబోధన చేస్తున్నాం. క్రీడాపద్ధతి ఆచరిస్తున్నాం. పిల్లలకు పాఠాలను ఇష్టపడేలా చెప్పాలి. ఆట, పాటలతో చెబితే వినేందుకు ఆసక్తి చూపిస్తారు. వాళ్ల స్థాయికి టీచర్ దిగిపోవాలి. పాఠాలతోపాటు జాతీయ పండగలు, జాతీయోద్యమంలో కీలక ఘట్టాల గురించి కూడా వారికి అవగాహన కల్పిస్తున్నాం. పాఠాలకు అనుగుణంగా పాత్రలు రూపొందించి చెబుతుండటంతో పిల్లల్లో బాగా ఆసక్తి పెరుగుతుంది. క్రీడాపద్ధతి, కథలు చెప్పించటం, జట్టు కృత్యాలు, స్పెల్లింగ్ టెల్లింగ్, బొమ్మలు గీయించటం, వివిధ సబ్జెక్టులకు సంబంధించిన అంశాలపై ప్రత్యక్ష వీక్షణలకు ఏర్పాట్లు చేస్తున్నాం. బ్లాక్‌బోర్డులు, టీచింగ్ మెటీరియల్స్, ఫ్లోచార్డులు, ఆల్బమ్‌లు వంటివి చేసి చూపించటం ద్వారా విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో అంశాలపై సమగ్రమైన అవగాహన వస్తోంది. ప్రతి విద్యార్థి తనలోని భావాలు, ఆసక్తులు ఎలాంటి భయంలేకుండా వ్యక్తం చేయగలుగుతున్నారు. స్వేచ్ఛగా తన మనసులో వచ్చిన ఆలోచనలను వ్యక్తపరుస్తున్నారు. ఆర్ట్స్, డిజిటల్ క్లాసులు వంటివి కూడా ఏర్పాటుచేస్తున్నాం. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారందరికి అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. వివిధ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణలు కొనసాగిస్తున్నాం.



- మేకల భాస్కరరావు
కొండాయపాలెం దళితవాడ నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ఆటపాటలతో విద్యాబోధన



సంతోషాత్మక విద్యాబోధన ద్వారా ప్రతి ఒక్కరూ కృత్యాల్లో పాల్గొనటం, మాట్లాడటం,చర్చించటం చేయిస్తున్నాం. తద్వారా ప్రతి ఒక్కరూ తమ అనుభవాలు, ధైర్యంగా చెప్పటానికి అవకాశం ఉంటుంది. ప్రతిరోజూ సైన్స్‌కు సంబంధించిన ఒక్కో కొత్త పదాన్ని నేర్పుతున్నాం. ఎవరికి సబ్జెక్టు పాఠాలు అర్థమవుతున్నాయి. ఎవరికి కావటం లేదో తెలుసుకుంటున్నాం. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక కేంద్రీకరణ ఉంచటం వల్ల వారు అర్థంకాకపోతే వెంటనే అడిగే స్వేచ్ఛ ఏర్పాటుచేశాం. నేను విశ్లేషణ (అనాలసిస్), ప్రశ్నించటం (క్వశ్చనింగ్), భావప్రసరణ (ట్రాన్స్‌రైజేషన్) వంటి పద్ధతుల ద్వారా బోధన అందిస్తున్నా. సైన్స్, లెక్కలు వంటి సబ్జెక్టులను తరగతిలో గదిలోనే కాకుండా క్రీడామైదానాలు, ఆవరణలు, క్షేత్రస్థాయి సందర్శనల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. సైన్స్‌విజ్ఞానపరమైన కృత్యాలను వ్యక్తిగతంగానూ, జట్టు కృత్యంగా చేయిస్తూ మెరుగైన ఫలితాలు చేసిన వారికి బహుమతులు ఇవ్వటం ద్వారా ప్రోత్సహిస్తున్నా. సమాజం, ప్రకృతి, కుటుంబం, జీవితం, వ్యవసాయం, ఆర్థిక అంశాలు, లెక్కలకు సంబంధించి కూడికలు, గుణింతాలు, తీసివేతలు, భాగహారాలు, ఆరోహణ, అవరోహణ అంశాలు ఇలా ప్రతి ఒక్క దాని గురించి చెప్పించటం వల్ల సులభంగా గుర్తుంటుంది. ఆటల్లో గెలుపు ఓటములు, ఆలోచనల్లో అనుకూల, వ్యతిరేక అంశాల నిర్వహణ, సైన్స్, గణితంలో సూత్రాలు, పీరియాడిక్ టేబుళ్ల వంటి అంశాలపై కృత్యపద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం.



- శెట్టెం ఆంజనేయులు
మాసాపేట హైస్కూలు సైన్స్ ఉపాధ్యాయుడు, రాయచోటి పట్టణం, అన్నమయ్య జిల్లా

ఓటీటీలోకి 'జైలర్'



రజినీకాంత్ హీరోగా డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన 'జైలర్' చిత్రం ఓటీటీ స్ట్రీమింగ్‌కి సిద్ధమైంది. ఆగస్ట్ 10న విడుదలైన ఈ సినిమా ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళ్ల రాబట్టింది. ప్రస్తుతం జైలర్ థియేట్రికల్ రన్ కొనసాగిస్తుండగానే సెప్టెంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో అందుబాటులో ఉంటుందని మేకర్స్ తెలియజేశారు. ఈ సినిమాలో కన్నడ నటుడు శివరాజ్ కుమార్, మోహన్ లాల్, తమన్నా, రమ్యకృష్ణ కీలకపాత్రలు పోషించారు.

'ఓజీ'లో నా పాత్ర



సుజిత్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ హీరోగా వస్తున్న 'ఓజీ' చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ఈ చిత్రంలో అజయ్ ఘోష్ కూడా నటిస్తున్నారు. ఈ మూవీ గురించి ఆయన తాజాగా కొన్ని ఆసక్తికర విషయాలను రివీల్ చేశారు. ఈ చిత్రంలో ఆయన గ్యాంగ్ స్టర్ రోల్ చేస్తున్నట్లు చెప్పారు. ఆ రోల్ కూడా చాలా కామెడీగా ఉంటుందని తెలుస్తోంది. తనతో పాటు సీనియర్ నటుడు జీవా కూడా గ్యాంగ్ స్టర్ క్యారెక్టర్ చేస్తున్నారని చెప్పారు. అయితే, తాము రిటైర్డ్ గ్యాంగ్ స్టర్స్‌లా కనిపిస్తామని, తమ పాత్రలు చాలా ఫన్నీగా ఉంటాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం కొద్ది రోజులు షూటింగ్ చేశామని, ఇంకా ఐదు, ఆరు రోజుల షూటింగ్ బ్యాలెన్స్ ఉందని అన్నారు. ఈ సినిమాలో ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తున్నారు. బాలీవుడ్ హీరో ఇమ్రాన్ హష్మీ విలన్‌గా నటిస్తున్నారు. శ్రియా రెడ్డి, అర్జున్‌దాస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మాణంలో రాబోతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. పవన్ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఈ చిత్రం నుండి ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేయడం తెలిసిందే.

టోక్యో ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో రవితేజ ఫ్యామిలీ



రవితేజ ఫ్యామిలీ ఫోటోలు చాలా రేర్‌గా బయటకొస్తుంటాయి. ఆయన కుమార్తె, కుమారుడు కూడా చాలా అరుదుగానే సోషల్ మీడియాలో కనిపిస్తుంటారు. ఆయన భార్య కళ్యాణి తేజ... ఇతర కుటుంబ సభ్యులెవరూ పెద్దగా మీడియా కంట పడరు. అయితే తాజాగా రవితేజ తన ఫ్యామిలీ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇటీవల ఫ్యామిలీతో జపాన్‌కి వెకేషన్‌కి వెళ్లిన రవితేజ తన కుటుంబంతో సెల్ఫీలు దిగిన కొన్ని ఫోటోలను షేర్ చేశారు. 'టోక్యోలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్ అన్నట్టు.. బట్ బోత్ ఆర్ నాట్ సేమ్ అంటూ' అంటూ ఆ ఫొటోకి క్యాప్షన్ కూడా ఇచ్చారు.

'మాక్స్'తో సుదీప్



కన్నడ నటుడు కిచ్చా సుదీప్ చేస్తున్న తాజా చిత్రం 'మాక్స్'. విజయ్ కార్తికేయన్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శనివారం సుదీప్ పుట్టినరోజు సందర్భంగా ఈ మూవీ టైటిల్ టీజర్‌ను మేకర్స్ సోషల్ మీడియాలో విడుదల చేశారు. 'నార్త్ డైరెక్షన్ నుంచి 10 బండ్లలో హెవీ వెపన్స్‌తో వస్తున్నారు సర్. పడమర నుంచి 12, తూర్పు నుంచి 13' అంటూ ఫోన్‌లో వస్తున్న సందర్భాన్ని నోట్ చేసుకుంటున్న పోలీస్ ఆఫీసర్.. 'ఇప్పుడు రాబోయే వాళ్ళు అగ్ని పర్వతం నుంచి తప్పించుకోవచ్చు. భూకంపం నుంచి తప్పించుకోవచ్చు.. తుఫాన్ నుంచి తప్పించుకోవచ్చు. సునామీ నుంచి కూడా తప్పించుకోవచ్చు కానీ వీడితో పెట్టుకుంటే సావు లేని వరంతో పుట్టినోడు కూడా చచ్చిపోతాడు' అనడం టీజర్‌లో కనిపించింది.

దీపావళికి 'టైగర్ 3'



సల్మాన్ ఖాన్ నటిస్తున్న తాజా చిత్రం 'టైగర్ 3' విడుదలకు సిద్ధమైంది. మనీశ్ శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యాష్ రాజ్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. కత్రినాకైఫ్ హీరోయిన్‌గా చేస్తున్నారు. షారుఖ్ ఖాన్ కామియోలో మెస్మరైజ్ చేయబోతున్నారు. ఈ సినిమాని దీపావళి కానుకగా హిందీ, తెలుగు తమిళ భాషల్లో విడుదల చేయబోతున్నట్లు తాజాగా మేకర్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అయితే విడుదల తేదీని మాత్రం ఇంకా ప్రకటించలేదు. ఈ చిత్రానికి సంబంధించి చివరి షెడ్యూల్ మినహా దాదాపు షూటింగ్ పూర్తి చేసుకుంది. వచ్చే నెల నుంచి సినిమా ప్రమోషన్స్ ప్రారంభం కానున్నాయి. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ విలన్‌గా నటిస్తుండగా.. అశుతోష్ రాణా, అనుప్రియా గోయెంకా, రిద్ధి డోగ్రా, అంగద్ బేడీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

కోలీవుడ్ నటుడు శివాజీ మృతి



కోలీవుడ్ నటుడు ఆర్ఎస్ శివాజీ (66) కన్నుమూశారు. హాస్యనటుడిగా మంచి గుర్తింపుతెచ్చుకున్న శివాజీ అనారోగ్య సమస్యలతో చెన్నైలోని ఓ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తమిళంలో వందకుపైగా సినిమాల్లో నటించారు. ఈ విషయం తెలుసుకున్న కోలీవుడ్ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. శివాజీ ప్రముఖ నిర్మాత ఎంఆర్ సంతానం కుమారుడు కాగా.. ఆయన సోదరుడు సంతాన భారతి కోలీవుడ్‌లో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 1981లో వచ్చిన 'పన్నీర్ పుష్పాలు' సినిమాతో శివాజీ తెరంగేట్రం చేశారు. 'కోలమావు కోకిల', 'సూరరై పొట్రు', 'ధారల ప్రభు' 'గార్గి' లాంటి చిత్రాల్లో కనిపించారు. స్టార్ హీరో కమల్ హాసన్, రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో కలిసి ఎక్కువ చిత్రాల్లో పనిచేసినందుకు కోలీవుడ్‌లో గుర్తింపు పొందారు. కాగా.. శివాజీ చివరిసారిగా యోగి బాబు నటించిన 'లక్కీ మ్యాన్'లో కనిపించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది.

మెరుపులు వర్షార్పణం

- హార్దిక్, ఇషాన్ అర్ధసెంచరీలు
- టీమిండియా 266ఆలౌట్
- భారత్-పాక్ మ్యాచ్ రద్దు
- ఇరుజట్లకు చెరో పాయింట్



భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ అంటే ఆ మజానే వేరు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుంటారు. శనివారం పల్లెకెలె వేదికగా భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. టీమిండియా ఇన్నింగ్స్‌కు తొలుత రెండుసార్లు ఆటంకపరిచిన వరుణుడు.. ఇన్నింగ్స్ ముగిశాక ఇక అవకాశమివ్వలేదు. దీంతో పాకిస్తాన్ జట్టు ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు అవకాశమే దక్కలేదు. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు భారతజట్టు 48.4ఓవర్లలో 266పరుగులకు కుప్పకూలింది. ఇషాన్(82), హార్దిక్(86) టాప్ స్కోరర్స్. పాక్ బౌలర్లు షాహిన్ అఫ్రిది(4/35), నసీమ్(3/36), రవూఫ్(3/58) బౌలింగ్‌లో మెరిసారు.



పల్లెకెలె: భారత్-పాకిస్తాన్ ఆసియా కప్ మ్యాచ్‌కు వర్షం అడ్డంకిగా నిలిచాడు. భారతజట్టు ఇన్నింగ్స్ ఆరంభించినప్పుడు కొంతసేపు అడ్డంకిగా నిలిచిన వరుణుడు, టీమిండియా ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత మరోసారి ఆటంకపరిచాడు. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు పాకిస్తాన్ పేసర్ల ధాటికి 266పరుగులకే ఆలౌటైంది. తొలుత కెప్టెన్ రోహిత్ శర్మ(11), శుభ్‌మన్ గిల్(10), విరాట్ కోహ్లీ(4), శ్రేయస్ అయ్యర్(14) నిరాశపరిచారు. దీంతో టీమిండియా 66పరుగులకే టాపార్డర్ నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో టీమిండియా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యతను ఇషన్ కిషాన్, హార్దిక్ పాండ్యా చేపట్టారు. షాదాబ్ ఖాన్ వేసిన 29వ ఓవర్ రెండో బంతికి సింగిల్ తీయడంతో ఇషాన్ కిషన్ 54బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుచేశాడు. ఆ తర్వాత సెంచరీ దిశగా వెళ్తున్న ఇషాన్‌ను పాక్ బౌలర్ హారిస్ రవూఫ్ 38వ ఓవర్ మూడో బంతిని భారీ షాట్ కొట్టడంతో బాబర్ ఆజామ్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో టీమిండియా 204 పరుగుల వద్ద ఐదో వికెట్‌ను కోల్పోయింది. ఆ తర్వాత స్కోర్ పెంచే బాధ్యతను హార్దిక్ పాండ్యా అందుకున్నాడు. షాహీన్ అఫ్రిది వేసిన 44వ ఓవర్ తొలి బంతికి అఘా సల్మాన్‌కు క్యాచ్ ఇచ్చి పాండ్యా పెవిలియన్ దారి పట్టడా.. అదే ఓవర్ చివరి బంతికి రవీంద్ర జడేజా కూడా ఔటయ్యాడు. ఆ వెంటనే శార్దూల్ ఠాకూర్ ఇలా ఒక్కొక్కరు పెవీలియన్ బాట పట్టారు. దీంతో టీమిండియా కనీసం 250పరుగులైనా చేస్తుందా అనే అనుమానం కలిగింది.

10కి పది పేసర్లకే..

పాకిస్తాన్ పేసర్లు భారత్‌పై రాణించారు. భారత్‌తో జరిగిన పోరులో 10కి పది వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. నాణ్యమైన పేస్‌ను ఎదుర్కోవడం టీమిండియాకు కష్టమే అని మ్యాచ్‌కు ముందు నుంచే మాజీలు పేర్కొన్నట్లే జరిగింది. వర్షం అంతరాయం మధ్య జరిగిన మ్యాచ్‌లో పాక్ పేసర్లు అదరగొట్టారు. ప్రపంచంలో తమది అత్యుత్తమ పేస్ త్రయం ఎలా అయిందో పల్లెకెలెలో చూపించారు. తొలి స్పెల్‌లో నిప్పులు చెరిగిన షాహీన్ షా అఫ్రిది.. భారత కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని తొలుత వెనక్కి పంపాడు. ఆ తర్వాత జడేజా, పాండ్యాలను ఒకే ఓవర్‌లో ఔట్ చేసి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. షాహిన్ అఫ్రిది(4/35), నసీమ్ షా(3/36), రవూఫ్(3/56) పది వికెట్లు కూల్చారు. స్టార్ స్పిన్నర్ షాదాబ్, నవాజ్ నిరాశపరిచారు.

స్కోర్‌బోర్డు..

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (బి)షాహిన్ అఫ్రిది 11, శుభ్‌మన్ (బి) రవూఫ్ 10, కోహ్లి (బి)షాహిన్ అఫ్రిది 4, శ్రేయస్ అయ్యర్ (సి)ఫకర్ (బి)రవూఫ్ 14, ఇషాన్ (సి)బాబర్ (బి)రవూఫ్ 82, హార్దిక్ (సి)అఘా సల్మాన్ (బి)షాహిన్ షా 87, జడేజా (సి)రిజ్వాన్ (బి)షాహిన్ షా 14, శార్దూల్ (సి)షాదాబ్ (బి)నసీమ్ షా 3, కుల్దీప్ (సి)రిజ్వాన్ (బి)నసీమ్ షా 4, బుమ్రా (సి)అఘా సల్మాన్ (బి)నసీమ్ షా 16, సిరాజ్ (నాటౌట్) 1, అదనం 20. (48.5 ఓవర్లలో ఆలౌట్) 266పరుగులు. **వికెట్ల పతనం:** 1/15, 2/27, 3/48, 4/66, 5/204, 6/230, 7/242, 8/242, 9/261, 10/266 **బౌలింగ్:** షాహిన్ అఫ్రిది 10-2-35-4, నసీమ్ 8.5-0-36-3, రవూఫ్ 9-0-58-3, షాదాబ్ 9-0-57-0, నవాజ్ 8-0-55-0, అఘా సల్మాన్ 4-0-21-0.


హాకీ-5 ఆసియాకప్ విజేత భారత్

ఫైనల్లో పాకిస్తాన్‌పై షూటౌట్‌లో గెలుపు

సలాలహ్(ఓమన్): హాకీ-5 ఆసియాకప్ టైటిల్‌ను భారత పురుషుల హాకీ జట్టు కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో భారత్ పెనాల్టీ షూటౌట్‌లో 3-2గోల్స్ తేడాతో పాకిస్తాన్‌పై సంచలన విజయం సాధించింది. నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరుజట్లు 4-4గోల్స్‌తో సమంగా నిలిచాయి. తొలి అర్ధభాగం ముగిసే సరికి భారతజట్టు 2-3గోల్స్ తేడాతో వెనుకబడింది. ఆ తర్వాత భారత్ వరుసగా పాకిస్తాన్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసి 4-4గోల్స్‌తో సమం చేసింది. షూటౌట్‌లో మణిందర్ సింగ్, గుర్‌జ్యోత్ సింగ్ గోల్స్ చేయగా.. భారత గోల్‌కీపర్ సురజ్ కర్కేటా పాకిస్తాన్ ఆటగాళ్లు ఆర్షాద్, మహ్మద్ కొట్టిన బంతులను నిలువరించి సీజన్-1 టైటిల్‌ను భారత్‌కు అందించాడు.

రైబకినాకు షాక్

- మూడోరౌండ్‌లో అన్‌సీడెడ్ క్రీడాకారిణి చేతిలో ఓటమి
- ప్రి క్వార్టర్స్‌కు గాఫ్, వాజ్నియాకీ
- యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో ఓ సంచలనం నమోదైంది. మాజీ వింబుల్డన్ టైటిల్ విజేత, 4వ సీడ్, రైబకినా అనూహ్యంగా మూడోరౌండ్‌లోనే ఇంటిదారిపట్టింది. శనివారం మూడోరౌండ్ పోటీలో రైబకినా 3-6, 7-6(8-6), 4-6తో 30వ సీడ్ క్రిస్టెల్లా(జర్మనీ) చేతిలో పోరాడి ఓడింది. ఇక ప్రి క్వార్టర్స్‌కు 6వ సీడ్, అమెరికాకు చెందిన కోకా గాఫ్, 15వ సీడ్ బెన్సిక్ ప్రవేశించారు. మూడోరౌండ్‌లో గాఫ్ 3-6, 6-3, 6-0తో 32వ సీడ్ మెర్టెన్స్(జర్మనీ)పై, స్విట్జర్లాండ్‌కు చెందిన బెన్సిక్ 7-6(7-1), 2-6, 6-3తో జూ(చైనా)పై పోరాడి నెగ్గారు. మరో పోటీలో మాజీ నంబర్‌వన్ క్రీడాకారిణి వాజ్నియాకీ(డెన్మార్క్) 4-6, 6-3, 6-1తో బ్రాడీ(అమెరికా)పై గెలిచింది.

చెమటోడ్చిన జకోవిచ్..

పురుషుల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరేట్ నొవాక్ జకోవిచ్ ఐదుసెట్ల హోరాహోరీ పోరులో చెమటోడ్చి నెగ్గాడు. మూడోరౌండ్‌లో జకోవిచ్ 4-6, 4-6, 6-1, 6-1, 6-3తో 32వ సీడ్ డారే(సెర్బియా)పై విజయం సాధించాడు. అలాగే 9వ సీడ్ ఫ్రిట్జ్, టామీ పాల్(అమెరికా) మూడోరౌండ్‌లో గెలిచి ప్రి క్వార్టర్స్‌కు చేరారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68